



వయో.. వేదన



ఏటా జనవరి 1 ఏపీపీఎస్సీ క్యాలండర్ ప్రకటిస్తాం.. ఉద్యోగాలను భర్తీ చేస్తాం.. మెగా డీఎస్సీ నిర్వహించి పెద్దసంఖ్యలో డీఎస్సీ నియామకాలు చేస్తాం.. అని అధికారంలోకి వచ్చిన జగన్ నాలుగు ఏళ్ల తొమ్మిది నెలలుగా ఆ విషయం మరిచిపోయారు. ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో డీఎస్సీ ప్రకటించారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.. వయో పరిమితి పెంచి పోస్టులను భర్తీ చేయాలన్న నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదనగా మారింది. నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం వయో పరిమితిని పెంచింది. ఈ క్రమంలో పక్క రాష్ట్రంలో పుట్టి ఉంటే, కనీసం అక్కడ చదువుకుని ఉంటే తమ ఆశలు నెరవేరేవనే భావనలో ఏపీలోని సీనియర్ నిరుద్యోగులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా వయోపరిమితి బాధితుల జాబితాలో చేరారు.

- నిరుద్యోగుల ఆవేదన అరణ్యరోదన
- వయోపరిమితి సడలింపు మంకుపట్టు
- 42 ఏళ్లకే పరిమితంపై కన్నీరు మున్నీరు
- కాళ్లా వేళ్లా పడినా కనికరించని ప్రభుత్వం
- హైకోర్టు సూచనలను పెడచెవిన పెట్టిన వైనం
- తెలంగాణలో 46 ఏళ్లకు పెంచిన రేవంత్ ప్రభుత్వం
- డీఎస్సీ అభ్యర్థుల నుంచీ వయో పరిమితిపై వినతులు
- పోటీ పరీక్షలకు అర్హత కోల్పోయిన వేల మంది నిరుద్యోగులు



గుంటూరు, ఫిబ్రవరి 12: ఒక్క ఛాన్స్.. ఒక్కఛాన్స్ అంటూ వేడుకుని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. నిరు ద్యోగులకు మాత్రం ఒక్క ఛాన్స్ ఇవ్వడానికి నిరాకరిస్తున్నారు. వయోపరమితిని 42 నుంచి 44 ఏళ్లకు పెంచమని నిరుద్యోగులు నెలల తరబడి కాళ్లా, వేళ్లా పడి వేడుకన్నా కనికరించేది లేదు దీంతో ఆరేళ్లుగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉమ్మడి జిల్లాలోని వేలాదిమంది నిరుద్యోగులు అర్హత కోల్పోయారు. పరీక్షలు రాయకుండానే ఉద్యోగాన్ని పొందే అవకాశాన్ని కోల్పోయారు. తమకు ఒక్క ఛాన్స్ కూడా ఇవ్వకపోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్కరాష్ట్రం తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుద్యోగుల ఆవేదనను అర్థం చేసుకుని అడిగిందే తడవుగా వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. కానీ జగన్ మాత్రం ససేమిరా లేదు పొమ్మన్నారు. ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రాష్ట్రంలో కాళీగా వున్న 2లక్షల 38వేల పోస్టుల భర్తీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఐదేళ్లగా జాబ్ క్యాలెండర్ మాటేమోగానీ, కనీసం నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. ఫలితంగా రాష్ట్రంలోని లక్షలాదిమంది నిరుద్యోగులు పోటీ పరీక్షల అర్హత వయసు దాటిపోయారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోనే దాదాపు 50 వేల మంది అనర్హతబారిన పడ్డారు. ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇవ్వకుండా చేసిన జాప్యానికి వయసుపెరిగి సీనియర్ నిరుద్యోగులు బలైపోయారు. కానీ ఇవేవీ పట్టించుకోని ముఖ్యమంత్రి ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగులకు వయో పరిమితి సడలించేందుకు నిరాకరించారు. ఇదిలా ఉండగా తాజాగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమ వయో పరిమితిని 44 నుంచి 47కు పెంచాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పోటీ పరీక్షల్లో ఉద్యోగం పొందేందుకు సీనియర్ నిరుద్యోగులకు ఇదే చివరి అవకాశం అవుతుంది. వయోపరిమితి దాటిపోయిన వారికి ఈసారి ఉద్యోగం పొందలేకపోతే ఇక ఉద్యోగం వచ్చే అవకాశం ఎంతమాత్రం ఉండదు. మిగిలిన వారందరికీ ఈ నోటిఫికేషన్ కాకపోతే మరో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంటుంది. కానీ సీనియర్లకు అలా కాదు. కానీ ప్రభుత్వం ఈ అంశాన్ని మానవీయ కోణంలో కూడా ఆలోచించడానికి నిరాకరించడం నిరుద్యోగుల పాలిట పెను విషాదంగా పరిణమిస్తోంది. ఇప్పటికే నిరుద్యోగ సమస్య కారణంగా రాష్ట్రంలో 1745 మంది చనిపోయారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ మొండి వైఖరి కారణంగా అర్హత కోల్పోయిన సీనియర్ నిరుద్యోగులపై ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అయినప్పటికీ ప్రభుత్వం ఇంత మొండిగా వ్యవహరించడం వారిని కలచివేస్తోంది.

టీడీపీ హయాంలో పలుమార్లు సడలింపు

టీడీపీ ప్రభుత్వ హయాంలో పలుమార్లు వయో పరిమితిని సడలించి నిరుద్యోగులకు ఉద్యోగాలు పొందే అవకాశాలు కల్పించారు. గ్రూప్-1, గ్రూప్-2, డీఎస్సీ నోటిఫికేషన్లు రెండుసార్లకుపైగా ఇచ్చారు. వీటితోపాటు పలు శాఖల ఇంజనీరింగ్, డిగ్రీ లెక్చరర్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ తదితర పోస్టులకు టీడీపీ ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. నిరుద్యోగుల పరిస్థితిని అర్థం చేసుకుని అన్ని పరీక్షలకు వయోపరిమితిని సడలించింది. కానీ ప్రస్తుత సీఎం జగన్ నిరుద్యోగుల ఆవేదనను ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

వెంటవెంటనే టెట్, డీఎస్సీ

- మార్చి 14న టెట్ ఫలితాలు, 15 నుంచి డీఎస్సీ
- ప్రభుత్వ తీరుపై నిరుద్యోగుల మండిపాటు

టెట్.. ఆ వెంటనే డీఎస్సీ.. నిర్వహణపై నిరుద్యోగ ఉపాధ్యాయులు మండిపడుతున్నారు. ఒకే సారి రెండు పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో తెలియడం లేదని వాపోతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణత సాధిస్తేనే డీఎస్సీకి అర్హత. ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ అభ్యర్థులకు టెట్ కీలకం. కాని టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వాహణ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది. టెట్‌కు ఈ నెల 8 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కాగా 18తో గడువు ముగుస్తుంది. 27 నుంచి మార్చి 9 వరకు రాత పరీక్షలు, మార్చి 14న ఫలితాలను విడుదల చేస్తారు. ఈ నెల 18 లోగా దరఖాస్తు చేసుకుంటే 20 నుంచి మార్చి 9వ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తర్వాత డీఎస్సీ పరీక్షకు షెడ్యూల్ ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య నెల నుంచి 45 రోజుల వ్యవధి ఉండాలి. కాని మార్చి 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటి రోజు అంటే 15 నుంచి డీఎస్సీ రాత పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 27న టెట్, వచ్చే నెల 15 నుంచి డీఎస్సీ నిర్వహించ నున్నారు. వేర్వేరు సిలబస్‌లు అయినందున రెండు పరీక్షల మధ్య కొంత సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారు. రెండు పరీక్షల మధ్య తగినంత సమయం ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌లో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

దీనిపై అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వయోపరిమితి సడలించేలా సూచనలు జారీ చేసింది. వాటిని కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైపెచ్చు గత ప్రభుత్వాలు 36 నుంచి 42 ఏళ్లకు పెంచిన వయో పరిమితిని తాను పెంచినట్లుగా నిరుద్యోగులను వంచించేందుకు పూనుకున్నారు.


ప్రభుత్వం ఒక్కసారి ఆలోచించాలి

తెలంగాణ రాష్ట్రంలో వయో పరిమితి 46 ఏళ్ల ఉండగా, తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్లో కూడా వయో పరిమితి 44 ఏళ్లుగా ఉంది. ఈ రెండు అంశాలు చూసిన తరువాత నిరుద్యోగుల ఆవేదనకు అంతూపొంతూ లేకుండా ఉంది. అత్యధిక సంఖ్యలో ఉండే సాధారణ నిరుద్యోగులకు అవకాశం కల్పించాల్సిన ప్రభుత్వం ఇంత పట్టుదలగా ఎందుకు ఉందో కూడా వారికి అంతు చిక్కడం లేదు. పక్క రాష్ట్రాన్ని చూసైనా ఏపీ ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని, తమకు ఒక్క అవకాశం కల్పించాలని వేడుకుంటున్నారు. నోటిఫికేషన్ గడువు పూర్తయినా అనుబంధ నోటిఫికేషన్‌తో తమకు మరో అవకాశం కల్పించాలని కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా డీఎస్సీ అభ్యర్థులు కూడా తమకు వయో పరిమితిని పెంచాలని విన్నవించుకుంటున్నారు.

మేమేం నేరం చేశాం?

ఏపీలో పుట్టడమే మేం చేసిన నేరమా? లేక ఒక్క ఛాన్స్ అన్నందుకు గంపగుత్తగా ఓట్లేసి గెలిపించడమా మేం చేసిన నేరమా? ఏం చేశామని మమ్మల్ని ఇంతగా వేధిస్తున్నారు? ఏం నేరం చేశామని ఇంత అన్యాయం చేస్తున్నారు. తెలంగాణలో పుట్టి ఉంటే, అక్కడ చదువుకుని ఉంటే కనీసం తమ గోడు వినిపించుకునే అవకాశమన్నా ఉండేది. ఇక్కడ మా ఆవేదనను అర్థం పట్టించుకునే నాథుడే లేడు. మాలాంటి వారి ఆవేదనను అర్థం చేసుకుని తెలంగాణలో వయో పరిమితిని 46 ఏళ్లకు పెంచారు. ఇక్కడ కాళ్లా వేళ్లా పడినా పాలకులు కనికరించలేదు. హైకోర్టు సూచనలను పాలకులు పెడచెవిన పెట్టారు.

- సీనియర్ నిరుద్యోగులు ఆవేదన



ఎదురు తిరిగితే.. వేధింపులే!

సహజవనరుల దోపిడీకి అడ్డొచ్చిన అధికారులకు బదిలీని బహుమానంగా ఇచ్చారు.. ప్రశ్నించిన ప్రజలపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేశారు.. తమకు ఎదురు తిరిగితే సంక్షేమ పథకాలు అందవంటూ లబ్ధిదారులను తమ ఆధీనంలో ఉంచుకున్నారు.. నాలుగున్నరేళ్లుగా వైసీపీ నేతలు అధికారాన్ని అడ్డం పెట్టుకుని వ్యవహరించిన తీరు ఇది. ఎన్నికలు సమీపిస్తున్న వేళ వారి ఆగడాలు పరాకాష్టకు చేరి ఇన్ని రోజులు వైసీపీ కోసం పనిచేసిన నేతలపైనే కక్షసాధింపులకు దిగుతున్నారు. పూర్తి అభద్రతాభావంలోకి వెళ్లిపోయి ద్వితీయశ్రేణి నేతాగణాన్ని అనుమానంగా చూస్తూ వారిపైనే అధికార దండం ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే వైసీపీని వీడి టీడీపీలో చేరినవారి ఆర్థిక మూలాలతో పాటు తెలుగుదేశం పార్టీలోని ద్వితీయశ్రేణి నేతలే లక్ష్యంగా బెదిరింపులకు పాల్పడుతూ వికృత ధోరణిని ప్రదర్శిస్తున్నారు.

- పార్టీ వీడేవారిపై పాలకపార్టీ వికృత క్రీడ
- ఓటమి భయంలో వైసీపీ నాయకులు
- స్వపక్ష నేతలపైనా అధికార ప్రయోగం
- టీడీపీ నాయకుల ఆర్థిక మూలాలపైనా కన్ను
- ఇప్పటికే టీడీపీలో చేరిన వారిపై కక్ష సాధింపులు

బాపట్ల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల వైసీపీ... నియోజకవర్గాల ఇన్‌చార్జిల మార్పు విషయంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. దీంతో పార్టీ అధిష్టానం వైఖరిని తప్పుబడుతూ కొంతమంది వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు బహిరంగంగానే తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇదే వారుచేసిన నేరంగా వైసీపీ పెద్దలకు కనబడింది. వారిపై అధికార దండాన్ని ప్రయోగించే కార్యక్రమానికి పూనుకున్నారు. విస్తుగొలిపే విషయమేమిటంటే వారు ఇంకా వైసీపీలోనే కొనసాగుతున్నా అనుమానంతో వారిని వేధించడం మొదలుపెట్టారు. రేపల్లె నియోజకవర్గ పరిధిలోని ఓ మండల నాయకుడికి ఇటీవలే ఇలాంటి చేదు అనుభవం ఎదురైంది.

నేతలపైనా అదే ధోరణి....

అద్దంకి వైసీపీ ఇన్‌చార్జిగా హనిమిరెడ్డి నియామకాన్ని వ్యతిరేకిస్తూ శాప్ నెట్ ఛైర్మన్ కృష్ణచైతన్య తన కార్యక్రమాలు తాను విడిగా చేసుకుంటున్నారు. ఇవన్నీ కూడా వైసీపీ గొడుగుకిందే ఆయన చేస్తున్నారు. అయినప్పటికీ ఆ చర్యలపై అధిష్టానం కన్నెర్ర చేసి చైతన్యకు సంబంధించిన గ్రానైట్ క్వారీపై సోదాల పేరిట అధికారులను వైసీపీ పెద్దలు ఉసిగొల్పి ఆయనకు షాకిచ్చారు. ఇక్కడ కూడా ఆయన చేసిన నేరం అద్దంకిలో నూతన ఇన్‌చార్జిగా నియమించిన హనిమిరెడ్డిని వ్యతిరేకించడమే. ఇలా స్వపక్షంలో ఉంటూ కేవలం అభిప్రాయం చెప్పిన పాపానికి అధికారపార్టీ వేధింపులకు గురవుతున్నారు.

టీడీపీ వారిపైనా పలురకాలుగా..

జిల్లావ్యాప్తంగా వైసీపీని వీడి పచ్చకండువా కప్పుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ పరిణామాలు మింగుడుపడని పాలకపార్టీ టీడీపీ ద్వితీయశ్రేణి నేతాగణంపై కన్నేసి వారిని ఎలాగైనా వైసీపీలో చేరాలని లేకుంటే దాడులు తప్పవనే హెచ్చరికలు జారీ చేస్తున్నారని సమాచారం. అద్దంకి మండలంలో ఓ గ్రామంలో చిరు దుకాణం నిర్వహిస్తూ పొట్టపోసుకుంటున్న టీడీపీ సానుభూతిపరుల కుటుంబాన్ని వైసీపీలో చేరాలని తీవ్రఒత్తిడి తేవడమే కాకుండా ఆ దుకాణాన్ని కూలదోస్తామనే బెదిరింపులకు సైతం పాలకపార్టీ నేతలు దిగినట్లు సమాచారం. గతంలో వైసీపీలో ఉండి ఇటీవలే టీడీపీలో చేరిన రేపల్లె నియోజకవర్గానికి చెందిన ఓ నాయకుడికి సంబంధించి బిల్లులు ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్నాయి. పార్టీ మారడంతో ఆయనకు చెల్లించాల్సిన బిల్లులపై ఆశలు వదిలేసుకోవాల్సిందే అనే సంకేతాలను వైసీపీ నేతలు పంపారు. వీళ్లనే కాకుండా ఆయా గ్రామాల్లో క్రియాశీలకంగా పనిచేసే టీడీపీ ద్వితీయ శ్రేణి నేతల ఆనుపానులను విచారణ చేసి వాటి ఆధారంగా అధికారాన్ని అడ్డం పెట్టుకుని వారిపై ఒత్తిడి చేసి పబ్బం గడుపుకోవాలనే రాక్షస క్రీడకు వైసీపీ నాయకులు తెరతీశారని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు.

వివరాలు కావాలి...

వేమూరులో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికల పర్వం మొదలైన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఓ మండలస్థాయి టీడీపీ నేత ఈ చేరికల్లో కీలక భూమిక పోషించారు. సదరు టీడీపీ నేత ఆస్తిపాస్తుల వివరాలను ఆరా తీసి రెవెన్యూ రికార్డులను జల్లెడ పట్టాలనే అనధికారిక ఆదేశాలు సిబ్బందికి వెళ్లినట్లు సమాచారం. ఇలా అనేక చోట్ల టీడీపీ ద్వితీయశ్రేణి నేతలే లక్ష్యంగా బెదిరింపులకు దిగుతున్నారు. అయినప్పటికీ వీటికి లొంగకుండా తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు ఉండడంతో అసహనంతో వైసీపీ నేతలు రగిలిపోతున్నారు.

ఓటమి భయమే...

రోజురోజుకూ ఆయా నియోజకవర్గాల్లో పాలకపార్టీపై పెరుగుతున్న వ్యతిరేకతతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నేతలు స్వపక్షం, విపక్షం అన్న తేడా లేకుండా కక్ష సాధింపులకు దిగుతూ జనంలో మరింత పలచనవుతున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. మరోవైపు నూతన ఇన్‌చార్జిలు వచ్చినచోట వైసీపీ శ్రేణుల నుంచే వారికి సహకారం అందకపోవడం వారిని మరింత అయోమయానికి గురిచేస్తోంది. ఈ నేపథ్యంలోనే టీడీపీలోకి చేరికలు ఊపందుకోవడం, స్వపక్షంలోనే అసమ్మతి స్వరాలు పెరగడంతో పిడుగుకి బియ్యానికి ఒకటే మంత్రం అన్నట్లు వైసీపీ నేతలు వ్యవహరిస్తూ అందరిపైనా అధికార దండం ప్రయోగించే వికృతక్రీడకు తెరతీశారనే విమర్శలు అన్ని వైపుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి

- 313 పరిశ్రమలకు రూ.11.08 కోట్ల రాయితీ విడుదల
- ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల, ఫిబ్రవరి 12: పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయడానికి అధికారులంతా కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లా పారిశ్రామిక, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం సోమవారం స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమ స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో తాజాగా స్థాపించిన 313 పరిశ్రమలకు రూ.11.08 కోట్ల రాయితీ నగదును విడుదల చేశామన్నారు. జిల్లాలో ఉత్పత్తులు పెరిగితే ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆ దిశగా అధికారులు పనిచేయాలని చెప్పారు. నూతనంగా 329 దరఖాస్తులు సింగిల్ డెస్క్ విధానంలో రాగా 306 దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి అర్హులను గుర్తించామన్నారు. 21 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంపై కలెక్టర్ ఆరా తీశారు. సీఎంఈజీపీ కింద 814 దరఖాస్తుల్లో 302 అర్హత ఉన్నట్లు గుర్తించి మంజూరు చేశామన్నారు. విశ్వకర్మయోజన కింద 422 దరఖాస్తులను పరిశీలిస్తున్నామన్నారు. బాపట్ల, చీరాల, అద్దంకి ప్రాంతాల్లోని ఏపీఐఐసీ భూములలో పరిశ్రమల స్థాపనకు అనుమతులు ఇవ్వడానికి క్షేత్రస్థాయి పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖాధికారి వై.రామకృష్ణ, ఎల్‌డీఎమ్ శివకృష్ణ, ఎస్సీ ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, డిక్కి జిల్లా అధ్యక్షుడు భక్తవత్సలం తదితరులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను అరికట్టాలి

భ్రూణ హత్యలను అరికట్టడానికి అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. లింగ నిర్ధారణ నిరోధక చట్టం అమలు తీరుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం జరిగింది. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణితో కలిసి స్కానింగ్‌సెంటర్ల పనితీరుపై కలెక్టర్ చర్చించారు. స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. 69 స్కానింగ్ సెంటర్ల పునరుద్ధరణ ప్రక్రియపై చర్చించారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే మాతృ, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. సమావేశంలో ఏఎస్పీ పి.మహేష్, డీఎమ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ, వైద్యవిధానపరిషత్ ఇన్‌చార్జి కోఆర్డినేటర్ డాక్టర్ శేషకుమార్, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా



చినకొత్తపల్లి వద్ద కోళ్ళ ఫారం షెడ్‌లు

అద్దంకిలో చికెన్ దుకాణం వద్ద ధరల బోర్డు

ఫౌల్ట్రీపై కార్పొరేట్ పాగా

- ధర పెరగాల్సిన సమయంలో తగ్గిన చికెన్
- గ్రామీణ కోళ్ళఫారం నిర్వాహకులను దెబ్బతీసేందుకు పన్నాగం

అద్దంకి, ఫిబ్రవరి 12: కార్పొరేట్ సంస్థల కన్ను ఫౌల్ట్రీ పరిశ్రమపై పడింది. గ్రామీణ ప్రాంతంలోని కోళ్ళ ఫారాల నిర్వాహకులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు పన్నాగాలు పన్నుతున్నాయి. ఈ క్రమంలో కార్పొరేట్ సంస్థలు కూడబలుక్కొని రంగప్రవేశం చేశాయి. ఈక్రమంలోనే కార్పొరేట్ సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున కోళ్ల ఫారాలను ఏర్పాటు చేసుకున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో లీజుకు తీసుకున్నాయి. మరింత విస్తరించేందుకు పలుచోట్ల భూములు కొనుగోలు, షెడ్ల నిర్మాణాలను ప్రారంభించాయి. కార్తీక మాసం పూర్తయిన తర్వాత నుంచి చికెన్ ధరలకు రెక్కలు వస్తాయన్న ఆశతో గ్రామీణ ప్రాంతాల కోళ్ల ఫారంల నిర్వాహకులు పెంపకం చేపట్టారు. ఈనేపథ్యంలో ధరలు పెరగాల్సిన సమయంలో తగ్గడంతో ఫారాల నిర్వాహకులు లబోదిబోమంటున్నారు. సాధారణంగా ముడికోడి ధర ఫారం వద్ద రూ.120 ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90కి మించటం లేదు. ఇందులో రవాణా ఖర్చులు, బ్రోకరేజ్‌ల కింద మరో రూ.20 తగ్గించటంతో చేతికి వచ్చేది 70 రూపాయలే ఉంటుందని, దీంతో కనీసం ఖర్చులు కూడా రాక నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. లక్షల రూపాయలు నష్టం వాటిల్లుతుండటంతో పలువురు ఫౌల్ట్రీ ఫారంల నిర్వాహకులు ఇంతటితో విరమించుకునేం దుకు సిద్ధం అవుతున్నారు. మరికొందరైతే కార్పొరేట్ సంస్థలకు లీజుకు ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నారు.

రూ.12 లక్షల నష్టం



గతంలో ఎన్నడూ లేనివిధంగా కార్పొరేట్ సంస్థలు ఫౌల్ట్రీ పరిశ్రమలోకి రంగప్రవేశం చేసి ధరలు తగ్గించటంతో నష్టాలు వస్తున్నాయి. ఇప్పటికే రూ.12 లక్షల నష్టం వచ్చింది. దీంతో ఫౌల్ట్రీ పరిశ్రమ నిర్వహించటం కంటే మిన్నకుండటమే మేలుగా ఉంది.

- వెలనాటి శ్రీనివాసరావు, అద్దంకి

లీజుకు ఇవ్వడం మినహా గత్యంతరం లేదు



కోళ్ళ ధరలు ఈ నెలలో ఫారం వద్ద కిలో రూ.120 ఉంటుంది. ఈ ఏడాది రూ.80 నుంచి రూ.90కి మించి లేదు. దీంతో నష్టానికి అమ్ముకోక తప్పడం లేదు. ఇందులో రవాణా ఖర్చులు, ఇతర ఖర్చుల కింద మరో రూ.20 తగ్గిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితులలో ఫౌల్ట్రీ పరి శ్రమలు నిర్వహించే కంటే విరమించుకోవటమో లేక కార్పొరేట్ సంస్థలకు లీజు కు ఇ వ్వటం మినహా వేరే ప్రత్యామ్నాయం లేదు.

-రవి, గోవాడ, అద్దంకి మండలం

17న పర్చూరుకు చంద్రబాబు

బాపట్ల, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపడమే లక్ష్యంగా టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో రా...కదలిరా పేరిట బహిరంగసభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా ఈనెల 17న పర్చూరు నియోజకవర్గానికి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నారు. సభను పర్చూరు లేదా ఇంకొల్లు మండలంలో నిర్వహించేలా టీడీపీ నేతలు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందుకోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేయడానికి సోమవారం పలు ప్రదేశాలను పార్టీ నాయకులు పరిశీలించారు. మంగళవారానికి సభ నిర్వహించే ప్రదేశంపై స్పష్టత వస్తుందని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి..

ఇటీవల కాలంలో పర్చూరు నియోజకవర్గ పరిధిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లక్ష్యంగా పాలకపార్టీ అక్రమ కేసులను బనాయించడం ఒక ఎత్తయితే గ్రానైట్ ఫ్యాక్టరీల తనిఖీల పేరిట వైసీపీ ప్రైవేటు సైన్యాన్ని వెంటేసుకుని అధికారులు చేసిన హడావిడి విమర్శలకు తావిచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు అరెస్టవడం, బెయిల్‌పై విడుదలవడం జరిగిపోయింది. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలోనే రా.. కదలిరా బహిరంగసభను పర్చూరు నియోజకవర్గ పరిధిలో నిర్వహించేలా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

దిక్సూచి DIKSUCHI

ఐరాసలో సంస్కరణలు
అవరోధాలు-పరిష్కారాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

భారత్-భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వానికి కృషి

ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశం భారత్. పటిష్ట అతిపెద్ద ప్రజాస్వామ్యయుత దేశం. ప్రపంచంలో 5వ అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. ఐక్యరాజ్య సమితి పీస్ కీపింగ్ ఫోర్స్‌లోనూ ఇతర సహాయ దళాల్లోనూ, అనేక ఒప్పందాల్లోనూ భారత్ సుదీర్ఘ భాగస్వామిగా సేవలందిస్తోంది. ఈ నేపథ్యంతోనే భద్రతామండలిలో శాశ్వత సభ్య హోదాకు కొంతకాలంగా భారత దేశం ప్రయత్నిస్తోంది. భారత్ గతంలో ఎనిమిదిసార్లు భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యదేశంగా సేవలందించింది. ఆసియా-పసిఫిక్ కేటగిరీ నుంచి ఎన్నికైనప్పుడు 192కి 184 ఓట్లు సాధించింది. ఆ భారీ గెలుపు భారత్‌కు గల ప్రపంచ దేశాల మద్దతును మరోసారి ప్రతిఫలించింది. అయితే భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యత్వానికి పీ-5 దేశాలైన అమెరికా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తున్నప్పటికీ, చైనా అనేకసార్లు మోకాలు అడ్డుపెట్టింది.

భద్రతామండలిలో సంస్కరణల ఆవసరం

1. భద్రతామండలి ఏర్పాటైన తరవాత కేవలం 1963లో ఒక్కసారే విస్తరించారు. అది కూడా కొత్తగా నాలుగు తాత్కాలిక సభ్యదేశాలకు ఈ విస్తరింపు పరిమితమైంది. శాశ్వత సభ్యదేశాల సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు.

2. భద్రతామండలి శాశ్వత సభ్య దేశాలుగా కేవలం కొన్ని ప్రాంతాలకు మాత్రమే ప్రాతినిధ్యం లభించింది. అన్ని ప్రాంతాలకు సమ ప్రాతినిధ్యం లేదు. లాటిన్ అమెరికా, ఆస్ట్రేలియా, ఆఫ్రికా వంటి కొన్ని ఖండాలకు సైతం ప్రాతినిధ్యం దక్కలేదు. అదేవిధంగా ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన భారత్, పీ-5 దేశాలతో అన్నివిధాలా సమఉజ్జీలైన జపాన్, జర్మనీ వంటి దేశాలకూ భద్రతా మండలిలో శాశ్వత స్థానం విస్తరించలేదు.

3. కేవలం రెండో ప్రపంచయుద్ధ విజేతలనే కారణంతో, అణ్వాయుధశక్తి గల దేశాలన్న స్థాయితో మాత్రమే అప్పుడు పీ-5 దేశాలకు శాశ్వత సభ్యత్వం దక్కింది. కానీ ప్రపంచ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకున్న ఇంత సుదీర్ఘకాలం తరవాత కూడా అధికారం ఆ కొద్ది దేశాల చేతిలోనే కేంద్రీకృతమవడం ఏమంత ప్రజాస్వామికం కాదు. పైగా ఇప్పటికే అవి తమ వీటో పవర్‌ను తమ స్వలాభాలకు, రాజకీయ వ్యూహాత్మక లక్ష్యాల కోసం వినియోగిస్తున్నాయి.

4. భద్రతామండలి విస్తరణ లేకపోవడం, అధికారం కేంద్రీకృతం అవడం వల్ల ప్రపంచవ్యాప్తంగా దీనికి ప్రత్యామ్నాయంగా అనేక దేశాలు కలిసి ఇప్పటికే సైనిక, ఆర్థిక, వ్యూహాత్మక సహకారాల కోసం వివిధ కూటములను ఏర్పాటు చేసుకున్నాయి. ఈ చర్యల ఫలితంగా భద్రతామండలి ప్రాబల్యం క్రమంగా తగ్గిపోయి అది ఒక క్రియాశూన్య సంస్థగా పరిణమించే అవకాశాలు లేకపోలేదు.

5. టెర్రరిజం, సైబర్ భద్రత, ప్రాదేశిక జలాలకు వెలుపల ఉన్న సముద్ర ప్రాంతంపై అజమాయిషీ, వాతావరణ మార్పులపై క్రియా విధానాలు వంటి కొన్ని నేటి ప్రధాన సమస్యలపై పటిష్ట విధానాలను అమలుచేయడంలో ఐక్యరాజ్య సమితి భద్రతామండలి విఫలమైంది. అత్యధిక వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న దేశాలు, సముద్రాల్లో వ్యూహాత్మకంగా ఆక్రమణ చేపడుతోన్న దేశాలు, సైబర్ దాడులను ఆయుధాలుగా వినియోగిస్తున్న దేశాలు భద్రతామండలిలో శాశ్వత సభ్యదేశాలుగా ఉండటంతో అవి తమ ప్రయోజనాలకు భంగం కలిగేలా ఎలాంటి సంస్కరణలకూ పూనుకోవడం లేదు. ఇది భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వ విస్తరణ అవసరాన్ని తెలుపుతోంది.

6. చైనా వంటి శాశ్వత సభ్యదేశాలు తమ చేతుల్లో కేంద్రీకృతమైన అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడటం లేదు. శాశ్వత సభ్యదేశాల విస్తరణను వీటో పవర్‌తో అడ్డుకుంటున్నాయి. అందువల్ల వీటో పవర్‌కు సంబంధించి సైతం కుదింపులు, సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉంది.

7. ఉత్తర-దక్షిణార్ధగోళ భౌగోళికతల పరంగానూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వం కేంద్రీకృతంగానే ఉంది. దక్షిణార్ధగోళానికి ఎలాంటి ప్రాతినిధ్యం దక్కడంలేదు.

8. భద్రతామండలి శాశ్వత సభ్యదేశాలు రెండు కూటములుగా(అమెరికా దాని మిత్రదేశాలు వర్సెస్ రష్యా, చైనా)గా మోహరించి పరస్పర వ్యతిరేక ఎజెండాలను ఆశ్రయిస్తున్నాయి. అందువల్ల భద్రతామండలిపరంగా ఎలాంటి సకారాత్మక చర్యలూ పట్టాలకెక్కడంలేదు. ఈ వైరుధ్యాల స్థానంలో సహకారం, సమతౌల్యతలను తీసుకురావడానికి, బాధ్యతాయుత ప్రవర్తనకూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వ విస్తరణ, వీటో అధికారాల్లో సంస్కరణ అవసరం.

భారత్‌కు శాశ్వత సభ్యత్వం వల్ల ప్రయోజనాలు

- శాంతి సామరస్యాలు కోరుకొనే భారతదేశం- ఉగ్రవాదం, అక్రమ చొరబాట్లు, అంతర్జాతీయ సముద్ర జలాల భద్రత, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, ఇండో పసిఫిక్



ప్రాంతంలో చైనా ఆధిపత్య ధోరణి, కరోనా వైరస్ వంటి జీవాయుధాల సృష్టి, అంతర్జాతీయంగా కమ్ముకుంటున్న యుద్ధ పరిస్థితులు వంటి అనేక సమస్యలపరంగా భద్రతామండలి పటిష్ట చర్యలు తీసుకొనేవిధంగా అంతరంగిక ఒత్తిడి తీసుకురావచ్చు.
- భారత్ వంటి తటస్థ దేశం భద్రతామండలి శాశ్వత సభ్యత్వం, వీటో అధికారాలను కలిగి ఉండటం ద్వారా పీ-5 దేశాల నిర్ణయాల్లో ఆశ్రితపక్షపాతం, స్వప్రయోజనాలను నిలువరించవచ్చు.
- భారత్‌కు ప్రాతినిధ్యం దక్కడం ద్వారా ప్రపంచంలో 17.50% ప్రజలకు ప్రాతినిధ్యం దక్కినట్లవుతుంది.
- పాకిస్థాన్, చైనా వంటి సరిహద్దు దేశాల చొరబాట్లను, దుశ్చర్యలను మరింత సమర్థంగా నిలువరించే స్థాయి భారత్‌కు వస్తుంది.
- ఇప్పటికే ఐక్యరాజ్యసమితికి చెందిన అనేక ఒప్పందాల్లో, పీస్ కీపింగ్ మిషన్‌లో భాగస్వామిగా విస్తృత సేవలు అందిస్తున్న భారత్ మానవాళి సంక్షేమానికి వాటిని మరింత విస్తృతంగా చేపట్టవచ్చు.

భారత్ శాశ్వత సభ్యత్వానికి, భద్రతామండలి సంస్కరణలకు గల ప్రతిబంధకాలు

- కాంప్రహెన్సివ్ టెస్ట్ బ్యాన్ ట్రీటీ(సీటీబీటీ), న్యూక్లియర్ నాన్ ప్రొలిఫిరేషన్ ట్రీటీ(ఎన్‌పీటీ) వంటి ఒప్పందాలపై భారత్ సంతకం చేయకపోవడాన్ని చైనా వంటి దేశాలు ఒక సాకుగా చూపడం.
- భద్రతామండలికి సంబంధించి ఏ సంస్కరణలు తీసుకురావాలన్నా యూఎన్ చార్టర్ 'ఆర్టికల్ 108'లో చెప్పినవిధంగా ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను సవరించాల్సి ఉంటుంది. దీని ప్రకారం ఏ సంస్కరణనైనా కనీసం 2/3వ వంతు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఆమోదించాల్సి ఉంటుంది. అదేవిధంగా అన్ని శాశ్వత సభ్యదేశాలూ ఏకగ్రీవంగా ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఏ ఒక్క శాశ్వత సభ్యదేశమైనా ఒప్పుకోకుండా వీటో అధికారాన్ని ప్రయోగిస్తే అలాంటి సంస్కరణలు పట్టాలకెక్కవు. కాబట్టి ఈ సంస్కరణలకు పీ-5 దేశాల వీటో అధికారం ప్రధాన అవరోధంగా ఉంది.
- అంతర్జాతీయ వ్యవహారాలు, తీర్మానాలు, ఆంక్షలు, సైనిక చర్యలపరంగా శాశ్వత సభ్యదేశాలు తమకే దత్తం అయిన ప్రత్యేక అధికారాల కట్టడికి, పంపకానికి అంగీకరించడం లేదు.
- తనకు సమ ఉజ్జీగా నిలువ గల భారత్‌కు తనతో సమానంగా శాశ్వత సభ్యదేశ హోదా, తద్వారా వీటో అధికారం లభించడం చైనాకు సుతరామూ ఇష్టంలేక భారత్ ప్రయత్నాలకు గండికొడుతోంది.

భారత్ కింకర్తవ్యం, ముందున్న ప్రత్యామ్నాయాలు

1. భారత్ సభ్యదేశంగా ఉన్న అనేక కూటముల ద్వారా భద్రతామండలి సంస్కరణల ఆవసరాలపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచి, ఒత్తిడి తీసుకురావడం.

2. భద్రతామండలి, ఐక్యరాజ్యసమితికి ప్రత్యామ్నాయ ప్రపంచ కూటమి దిశగా ఆలోచనలు చేస్తున్న భారత్ వంటి దేశాలు వాటిని మరింత ముందుకు తీసుకువెళ్లి ఒక సమగ్ర రూపాన్ని ఇవ్వడం. అయితే భద్రతామండలిలో సంస్కరణలు, భారత్‌కు ఇతర ఆశావహ దేశాలకు శాశ్వత సభ్యత్వం లభించడమనేది ప్రస్తుతమున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో అంత సులువైన పనికాదు. శాశ్వత సభ్యదేశాల అనుచిత వర్గ ప్రయోజన చర్యలు, వ్యూహాత్మక ఎత్తుగడలకు అవి భద్రతామండలిలో తమ అధికారాన్ని వినియోగించడం(ఉదాహరణకు ఇజ్రాయెల్ - పాలస్తీనా వివాదపరంగా భద్రతామండలి ఇజ్రాయెల్‌ను నియంత్రిస్తూ చేసిన రిజల్యూషన్స్‌ను అమెరికా 16సార్లు తన వీటో అధకారం ప్రయోగించడం ద్వారా అడ్డుకుంది) ఒకటి. ఇలాంటి చర్యలను ప్రపంచ దృష్టికి విస్తృతంగా తీసుకురావడం ద్వారా, భద్రతామండలి సంస్కరణలపై ఆలోచనలు రేకెత్తి, భారత్‌కు మార్గం సుగమం అవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో అకడమిక్ కోర్సులు



హైదరాబాద్‌లోని డా. బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- 2024 జనవరి సెషన్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో పలు స్టడీసెంటర్లు అందుబాటులో ఉన్నాయి.

డిగ్రీ

- బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూపు అభ్యర్థులు అర్హులు. ఏపీ/తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఓపెన్ స్కూల్ నుంచి ఇంటర్ ఉత్తీర్ణులు; పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఒకటి ఎంచుకోవాలి.
- బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు; ప్రొఫెషనల్ డిగ్రీ(లా/ఇంజనీరింగ్/ఫార్మసీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

పీజీ

- ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.
- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది.

పీజీ డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

డిప్లొమా

- కోర్సు వ్యవధి ఏడాది. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **స్పెషలైజేషన్‌లు:** సైకలాజికల్ కౌన్సెలింగ్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, రైటింగ్ ఫర్ మాస్ మీడియా ఇన్ తెలుగు, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం, ఉమన్ స్టడీస్.

సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

- కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదోతరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.
- **విభాగాలు:** ఫుడ్ అండ్ న్యూట్రిషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్.
- ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సును ఇంగ్లీష్ మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.
- **చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.braouonline.in

ఆర్‌జీఐపీటీలో ఎంబీఏ

అమేథీలోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎంబీఏ, ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారు, లేనివారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశిత వెయిటేజీ ప్రకారం ప్రవేశాలు కల్పిస్తారు. పార్ట్ టైం ప్రోగ్రామ్, స్పాన్సర్డ్ కేటగిరీ అడ్మిషన్స్ కూడా ఉన్నాయి.

ఎంబీఏ

స్పెషలైజేషన్‌లు: ఎనర్జీ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్ 2023/ జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/సీమ్యాట్ 2024/జీమ్యాట్ 2022/జీమ్యాట్ (2023/2024)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

ఎంబీఏ(బిజినెస్ అనలిటిక్స్)

ఇది మల్టీ డిసిప్లినరీ ప్రోగ్రామ్. ఇందులో అనలిటికల్ టూల్స్, టెక్నిక్స్, మెథడాలజీలకు సంబంధించిన కోర్సులు ఉంటాయి.

అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి, ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీఎస్సీ/బీకాం/బీసీఏ/బీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023/జేవియర్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎక్స్‌ఏటీ) 2024/ సీమ్యాట్ 2024/జీమ్యాట్ (2023/ 2023)/మ్యాట్ 2024 అర్హత పొంది ఉండాలి. ఈ అర్హత లేని పక్షంలో పదోతరగతి, ఇంటర్, డిగ్రీ స్థాయుల్లో కనీసం 65 శాతం మార్కులు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **చివరి తేదీ:** ఏప్రిల్ 1
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/au3bWK9లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

వీరమల్లు రాక అప్పుడే...



క్రిష్ దర్శకత్వంలో పవన్ కల్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ సినిమా చిత్రీకరణ ఆగిపోయిందంటూ కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న వార్తలకు చెక్ పెడుతూ చిత్ర నిర్మాణ సంస్థ మెగా సూర్య ప్రొడక్షన్స్ కీలకమైన అప్డేట్‌ను ఇచ్చింది. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న విడుదల చేస్తున్నట్లు సోమవారం సోషల్ మీడియాలో ప్రకటించింది. త్వరలో ప్రోమోను కూడా విడుదల చేస్తున్నట్లు అందులో తెలిపారు. అసత్యాలు నమ్మవద్దు, భారీ హంగులు, అత్యున్నత ప్రమాణాలతో సినిమాను తీర్చిదిద్దాలనే ప్రయత్నం వల్ల చిత్రీకరణకు ఎక్కువ సమయం పడుతోంది అని మేకర్స్ పేర్కొన్నారు. ఇందులో పవన్‌కు జోడీగా నిధి అగర్వాల్ నటిస్తున్నారు. ఏఎం రత్నం సమర్పణలో ఏ. దయాకర్‌రావు నిర్మిస్తున్నారు.

యూత్ ఎంజాయ్ చేస్తారు

దర్శకుడు విఐ ఆనంద్

సందీప్‌కిషన్ హీరోగా నటించిన 'ఊరు పేరు భైరవకోన' ఈ నెల 16న విడుదల కానుంది. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా ఈ చిత్రాన్ని నిర్మించారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ హీరోయిన్లుగా నటించగా విఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చిత్ర విశేషాలు వెల్లడించారు.

- 'టైగర్' చిత్రం తర్వాత మరో సినిమా చేయాలని నేను, సందీప్ అనుకున్నాం. నా దగ్గరున్న రెండు ఐడియాల గురించి ఆయనకు చెప్పినప్పుడు 'ఊరు పేరు భైరవకోన' కథ



విని చాలా ఎక్సయిట్ అయ్యాడు. ఒక ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుందని ఆ కథను ఫిక్స్ చేశాం. నిర్మాత రాజేశ్‌గారు కూడా ఈ కథ బాగుందన్నారు. మా మంచి కోరే వ్యక్తి అనిల్ సుంకర్ కూడా ఈ ప్రాజెక్ట్‌లోకి రావడంతో జర్నీ మొదలైంది. కర్మ సిద్ధాంతం, గురించి చెప్పే సినిమా ఇది. గరుడ పురాణంలోని కొన్ని అంశాలు తీసుకున్నాం.

- సినిమాలో రెండు పెద్ద ట్విస్టులు ఉన్నాయి. ప్రతి పది నిమిషాలకు ప్రేక్షకులు ఊహించని మలుపులు ఉంటాయి.

మళ్లీ మనీషా చిత్రం!

'మాయలోడు', 'రాజేంద్రుడు గజేంద్రుడు' 'యమలీల', 'వినోదం' వంటి వినోదాత్మక చిత్రాలను ప్రేక్షకులకు అందించిన మనీషా సంస్థ అధినేత కిశోర్ రాఠి చాలా కాలం గ్యాప్ తర్వాత మళ్లీ చిత్ర నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీహర్ష, కషిక కపూర్ హీరో హీరోయిన్లుగా ఆయన నిర్మించే 'లవ్ యువర్ ఫాదర్' చిత్రం షూటింగ్ సోమవారం మల్లారెడ్డి కాలేజీలో ప్రారంభమైంది. పవన్ కేతరాజు ఈ చిత్రానికి దర్శకుడు. హీరో శ్రీహర్ష, గాయకుడు ఎస్పీ చరణ్‌పై చిత్రీకరించిన తొలి షాట్‌కు సీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గోపాలరెడ్డి క్లాప్ ఇవ్వగా, కామకూర శాలిని కెమెరా స్విచ్ఆన్ చేశారు.



ఈ సందర్భంగా నిర్మాతల్లో ఒకరైన మహేశ్ రాఠి మాట్లాడుతూ 'తండ్రీకొడుకుల మధ్య ఉండే బంధాన్ని, ఎమోషన్‌ను చూపించే సినిమా ఇది. మణిశర్మగారు సంగీత దర్శకత్వం వహిస్తున్నారు. మా నాన్నగారి ఆశీస్సులతో ఈ సినిమా నిర్మిస్తున్నాను' అన్నారు.

ఇంత అద్భుతంగా నటించానా అనిపించింది

రవితేజ



'ఈగల్ చిత్రానికి ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. కాళికాదేవి ఎపిసోడ్ చూస్తుంటే నేనేనా ఇంత అద్భుతంగా నటించింది అనిపించింది' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన 'ఈగల్' చిత్రం సక్సెస్‌మీట్ ఇటీవలే జరిగింది. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ 'నాకు అవకాశం ఇచ్చిన రవితేజ గారికి ధన్యవాదాలు. ఆయన వల్లే ఇంత గొప్ప విజయం సాధ్యమైంది' అని చెప్పారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ 'రవితేజతో 'ధమాకా' తర్వాత 'ఈగల్'తో మరో బ్లాక్‌బస్టర్ కొట్టాం. కార్తిక్‌తో మరిన్ని సినిమాలు చేయబోతున్నాం' అని తెలిపారు.

పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా?



తన వ్యక్తిత్వాన్ని కించపరిచేలా డిజిటల్ మీడియాలో వస్తున్న వార్తలపై దర్శకుడు హరీష్ శంకర్ 'ఈగల్' సక్సెస్‌మీట్‌లో ఘాటుగా స్పందించారు. 'నేను నిర్మాత ఇంట్లో పడి రేయింబవళ్లు తాగుతున్నానంటూ, నా షాడో ఫొటో పెట్టి ఓ వెబ్‌సైట్‌లో వార్తలు రాస్తున్నారు. నేను తాగుతుంటే మీరొచ్చి పెగ్ కలిపారా? స్టఫ్ ఇచ్చారా? మీకు నిజంగా దమ్ము ఉంటే నా ఫొటో పెట్టి ఆ వార్త రాయండి. అప్పుడు నా ప్రతిస్పందన చూద్దురు. 'ఇకపైనా ఇలానే చేస్తాం' అంటే చేసుకోండి. నా వెంట్రుక కూడా పీకలేరు' అని అన్నారు. 'నాకు గ్యాప్ వచ్చిందంటున్నారు, ఇప్పుడు ఒకేసారి ఐదు సినిమాలు చేస్తున్నా. ఇవన్నీ మీకు చెప్పి చేయాలా?, మా నాన్న లాగా స్కూల్ ఫీజు కట్టావా? నీకు చూపించడానికి' అని ప్రశ్నించారు. రివ్యూల్లో విమర్శ కనిపిస్తే సరే గానీ అది హేళన స్థాయికి వెళ్లడం చూస్తుంటే బాధేస్తోందన్నారు. సినీ జర్నలిస్టులు కూడా ఇండస్ట్రీలో భాగమే, కానీ మనలో మనం కలహించుకోవడం వల్ల బయటివారికి లోకువవుతున్నామని గుర్తెరగాలి అని హరీష్ శంకర్ హితవు పలికారు.



ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల కథ



'ఎంతో మంది త్యాగాలు చేస్తే మనం ఈ రోజు ప్రశాంతంగా ఉన్నాం. ముఖ్యంగా సర్దార్ వల్లభ బాయ్ పటేల్ లేకపోతే మనం ఈ రోజు ఇలా ఉండేవాళ్లం కాదు. చరిత్రను ఇలా దృశ్యరూపంలో చూపిస్తే మరింత అర్థమవుతుంది. ఈ ట్రైలర్ చూస్తే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నా శిష్యుడు సత్యనారాయణ అద్భుతంగా సినిమా తీశాడు. సుద్దాల అశోక్ తేజ రక్తంతో పాటలు రాస్తారా అనిపిస్తుంది. 'రజాకార్' చిత్రం విజయం సాధించాలి' అన్నారు సీనియర్ దర్శకుడు కె.రాఘవేంద్రరావు. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి నిర్మించిన 'రజాకార్' చిత్రం మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. దర్శకుడు యాటా సత్యనారాయణ మాట్లాడుతూ 'ఇటువంటి సినిమాలు తీస్తున్నప్పుడు బెదిరింపు కాల్స్, నెగెటివ్ కామెంట్స్ వస్తుంటాయి. అయినా లెక్క చేయకుండా మా చరిత్ర, మా పూర్వీకుల బాధలు, త్యాగాలు, ఈ గడ్డ కోసం పోరాడిన వాళ్ల గురించి చెప్పడానికే ఈ సినిమా తీశాను. ప్రపంచంలో అణిచివేతకు గురైన ప్రతి ఒక్కరికీ 'రజాకార్' చిత్రం అంకితం. రజాకార్లు చేసిన అన్యాయాన్ని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అన్నారు. 'సెప్టెంబర్ 17 ప్రాముఖ్యం గురించి చాలా మందికి తెలీదు. మళ్లీ రజాకార్లు పుట్టొద్దు. అందుకే ఆ చరిత్రను చరిత్రగానే తీశాం. ఈ సినిమా కోసం ఎంతో ఖర్చు పెట్టాం. మూడు రెట్లు బడ్జెట్ పెరిగినా, నా ఆస్తులు అమ్మి అయినా మన చరిత్రను అందరికీ చూపించాలని 'రజాకార్' చిత్రాన్ని తీశాం' అని తెలిపారు నిర్మాత గూడురు నారాయణరెడ్డి. ఇటువంటి చిత్రంలో నటించినందుకు ఆనందంగా ఉందని అనసూయ చెప్పారు. బాబీ సింహా, వేదిక, అనుష్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే తదితరులు నటించిన 'రజాకార్' చిత్రాన్ని తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, మరాఠి భాషల్లో విడుదల చేస్తున్నారు.

21న గోవాలో రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. తన ప్రియుడు, నిర్మాత జాకీ భగ్నానీని ఆమె పెళ్లాడనున్నారు. వివాహ ముహూర్తం నిశ్చయమైంది. ఈనెల 21న ఈ ప్రేమజంట గోవాలో ఒక్కటవబోతున్నారు. ఆహ్వాన పత్రిక సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కొద్దిమంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే ఈ పెళ్లికి హాజరవుతున్నారు.



'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/muk5BeP లో చదవండి.

రూ.14 లక్షలతో వీఏఏ ఉడాయింపు

నకిలీ రశీదులతో అధికారులకు బురిడీ ● పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రత్తిపాడు ఏవో

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 12: ప్రత్తిపాడు మండలంలోని వంగిపురంలో ప్రభుత్వం రైతులకు అందించే సబ్సిడీ శనగ విత్తకాల అమ్మకాల్లో వీఏఏ చేతివాటం ప్రదర్శించాడు. అమ్మకాలు చేసిన శనగ విత్తనాల సొమ్ము సుమారు రూ.14 లక్షలు చెల్లించకుండా ఉడాయించారు నెల రోజులుగా గుట్టుగా జరుగుతున్న తంతు పోలీసుల ఫిర్యాదుతో బట్టబయలైంది. వివరాల్లోకి వెళితే..

వంగిపురం వీఏఏగా గత ఏడాది ఫిబ్రవరిలో పాములపాడు నుంచి డిప్యుటేషన్‌పై మేకపోతుల హరీష్‌ను నియమించారు. గత ఏడాది జూలైలో పచ్చిరొట్టె ఎరువులు గ్రామంలో అమ్మకాలు జరిపి నకాలంలో ప్రభుత్వానికి చెల్లించాడు. తరువాత ఏపీ సీడ్స్ నుంచి నవంబరులో 40 శాతం సబ్సిడీతో సుమారు రూ.17 లక్షల విలువ గల 316 క్వింటాళ్ల శనగ విత్తనాలు (రెండు రకాలు) గ్రామానికి వచ్చాయి. వీటికి సంబంధించి బ్యాంకులో సరిగా డబ్బులు జమచేయలేదు. ఆ తరువాత డిసెంబరులో తుఫాను కారణంగా దెబ్బతిన్న పంటలకు 80 శాతం సబ్సిడీతో 12.5 లక్షల విలువ గల 420 క్వింటాళ్ల శనగలు వచ్చాయి. వీటికి సంబంధించి అధికారులు వత్తిడి చేస్తున్న సమయంలో కొద్దిగా బ్యాంకులో జమచేస్తూ వస్తున్నాడు. ఈ విధంగా సుమారు రూ.14,76,484 ఏపీసీడ్స్‌కు జమ చేసినట్లు ఏపీ సీడ్స్ అధికారులు ప్రకటించారు.

అయితే.. వ్యవసాయశాఖ అధికారులు వత్తిడితో యూనియన్ బ్యాంకులో డబ్బులు జమచేసినట్లు కొన్ని నకిలీ స్లిప్పులు సృష్టించి అధికారుల దృష్టి మరల్చాడు. జనవరి 8వ తేదీ నుంచి ఫోన్లు లిఫ్ట్ చేయకుండా, వ్యవసాయశాఖ అధికారులకు కనిపించకుండా ఉడాయించాడు. అప్పటి నుంచి ప్రత్తిపాడు వ్యవసాయశాఖ అధికారులతో పాటు జిల్లా అధికారులు అతని కోసం గాలించి చివరికి ప్రయోజనం లేదని పోలీసులకు పిర్యాదు చేశారు. అతని వద్ద నుండి ఇంకా ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సింది 14లక్షల33 వేల రూపాయలుగా అధికారులు లెక్కలు తేల్చారు.



విలేకరుల సమావేశంలో నిందితులను, గంజాయి ప్యాకెట్లను చూపుతున్న డీఎస్పీ జనార్ధనరావు, సీఐ రమేష్‌బాబు తదితరులు

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

8 మంది నిందితుల నుంచిఇ 3.6కేజీల గంజాయి స్వాధీనం

తెనాలి, మారీసుపేట, ఫిబ్రవరి 12: గంజాయిని ప్యాకెట్లలో నింపి తెనాలి, పరిసర ప్రాంతాల్లో విక్రయించే ముఠాను తెనాలి త్రీటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. సోమవారం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్థానిక త్రీటౌన్ పరిధిలోని రైల్వేస్టేషన్ వెనుక భాగంలో ఉన్న రైల్వే గూడ్స్ షెడ్డు వద్ద ఆదివారం సాయత్రం కొందరు వ్యక్తులు గంజాయిని విక్రయిస్తున్నారని అందిన సమాచారంతో సీఐ రమేష్‌బాబు తన సిబ్బందితో దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. మారీసుపేటకు చెందిన షేక్ నాగూరా, మండూరి ఏడుకొండలు, సిహెచ్రి పూర్ణచంద్, ఐతానగర్‌కు చెందిన రాహుత్ సల్మాన్, జ్యోతుల రాజ్ పాల్, ఉప్పుతోళ్ళ స్వామి, బాలాజీపేట, మహేంద్రనగర్‌కు చెందిన బల్లం భీమరాజు, ద్వారకా నగర్‌కు చెందిన మక్కెన చంద్రకిరణ్‌లు ఒక ముఠాగా ఏర్పడి నర్సీపట్నం ఏరియా నుండి 4 కేజీల గంజాయిని రూ.10 వేలకు కొనుగోలు చేసి వాటిని తెనాలికి తీసుకురావడం జరిగిందన్నారు. వీరివద్ద నుండి సుమారు రూ.3లక్షలు విలువజేసే 3.6 కేజీల గంజాయిని, రూ.800 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. నిందితులను చాకచక్యంతో పట్టుకున్న సీఐ రమేష్‌బాబు, ఎస్ఐ వెంకటేశ్వరావు, ఇతర పోలీసు సిబ్బందిని డీఎస్పీ జనార్ధన్‌రావు అభినందించారు.

ఎస్టీయూ పల్నాడు జిల్లా శాఖ
నూతన కార్యవర్గం ఎన్నిక

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా శాఖ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశం నరసరావుపేటలో జరిగిందని జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏ.ఏమండి సోమవారం తెలిపారు. సమావేశంలో 2024-26 నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. పల్నాడు జిల్లాశాఖ అధ్యక్షుడుగా ఎల్‌వీ రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్‌యాదవ్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా ఏ ఏమండి, జిల్లా గౌరవ అధ్యక్షుడుగా షేక్ కరిముల్లా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్ బాబు మాట్లాడుతూ 11వ పీఆర్సీలో తీవ్ర అన్యాయం చేశారని, 12వ పీఆర్సీ కమిటీ వేసి ఆరు నెలలుగా ఐఆర్ ప్రకటించక పోవడం దారుణమన్నారు. ఎన్నికల అధికారిగా కె.సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ రద్దుకై ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామని అన్నారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌ఎం సుభాని, జె.గంగాధర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు ప్రసంగించారు.. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.భీష్మారావు, ఎస్.రాఘవ, కె.రామలింగయ్య, వినుకొండ అక్కయ్య, టి.ఆంజనేయలు, టి.రాజాశేఖర్, సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సామాన్యుడిపై పన్నుల భారం : జీవీ ఆంజనేయులు

● టీడీపీలో చేరిన 80 కుటుంబాలు





వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ నగర్ వాసులు, పార్టీలో చేరిన వారికి కండువా కప్పి ఆహ్వానిస్తున్న జీవీ

వినుకొండ, ఫిబ్రవరి 12: ఒక్క అవకాశం అని జగన్‌రెడ్డి నమ్మించి పేద ప్రజలను మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. సంక్షేమం అంటూ ఒక చేత్తో రూ.10వేలు ఇచ్చి మరో చేత్తో లక్షల రూపాయలు దోచుకున్నారని విమర్శించారు. పట్టణంలోని 29వ వార్డు హనుమాన్‌నగర్ నుంచి పాలడుగు శ్రీను ఆధ్వర్యంలో 80 కుటుంబాలు అధికార వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ముందుగా హనుమాన్‌నగర్ నుంచి పెద్దఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. గుంటి ఆంజనేయస్వామి గుడిలో పూజల అనంతరం జీవీ ఆంజనేయులు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పాల చిన్న, పాలడుగు రమణయ్య, కర్నాటక దుర్గాప్రసాద్, ఎస్‌కే రహమాన్, బుజ్జి, సైదా, దాసరి రేణుక, బుజ్జమ్మ, బండారి బుజ్జి, పుల్లమ్మ, పద్మ, అంజలి, వెంకటలక్ష్మీ, మరియమ్మ, ఆంజనేయులు, ఎస్‌కే బుజ్జి, ఇమామ్‌షా, బాషా, అనిల్, బాబురావులతో పాటు మరికొంతమందికి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ ప్రజావ్యతిరేక ప్రభుత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ వైసీపీ నుంచి టీడీపీలో చేరడం జరిగిందని అన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏడుసార్లు కరెంటు చార్జీలు పెంచడమే కాక మూడు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి సామాన్యుడిపై మరింత భారాన్ని మోపారన్నారు. పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని, జగన్‌రెడ్డి వంట గ్యాస్ ధరలు పెంచడం, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడమే కాక చెత్త పన్ను అంటూ అనేక పన్నులు విధించి సామాన్య ప్రజలను దోచుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజలకు చేసిన మోసాలను గుర్తించి రానున్న ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షమీమ్‌ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, క్లస్టర్ ఇన్‌చార్జి సౌదాగర్ జానీబాషా, పల్లమీసాల దానయ్య, గంధం సుబ్బారావు, దస్తగిరి, రమణయ్య, గోవిందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యమా.. పోలీసు రాజ్యమా?

అక్రమ కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు ● 1518వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు ఫిబ్రవరి 12: మూడు రాజధానులంటూ మోసం చేసిన వైసీపీ ప్రభుత్వంపై తాము శాంతియుత మార్గంలో అమరావతే రాష్ట్రానికి ఏకైక రాజధాని అని ఉద్యమం చేస్తుంటే అక్రమ పోలీసు కేసులతో ఉద్యమాన్ని ఆపాలని చూస్తోందని రాజధాని అమరావతి నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు సోమవారం నాటికి 1,518వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు ధర్నా శిబిరాల నుంచి మాట్లాడుతూ, మూడుముక్కల ఆటతో సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాడన్నారు. చేసిన తప్పును సరిదిద్దుకొని అమరావతి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేసి మూడు రాజధానుల ముచ్చటను శాశ్వతంగా మూసేయాలన్నారు. అప్పులు తప్పితే రాష్ట్రంలో ఎక్కడా ప్రగతి కనబడటం లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాలలో రైతుల ఆందోళనలు కొనసాగాయి.

ఇన్‌స్పైర్ ప్రదర్శనలతో విద్యార్థుల సృజనాత్మకతకు పదును

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 12: విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడమే ఇన్‌స్పైర్ ప్రదర్శనల లక్ష్యమని డిప్యూటీ డీఈవో పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గుంటూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఉర్దూ హైస్కూల్‌లో బాపట్ల, గుంటూరు జిల్లాల విద్యార్థులకు నిర్వహించిన ఇన్‌స్పైర్ ప్రదర్శనను ప్రారంభించి ఆయన మాట్లాడారు. విద్యార్థి దశలోనే వారి సృజనాత్మకతకు పదునుపెట్టేలా విజ్ఞానంపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. తెనాలి డిప్యూటీ డీఈవో ఎం.నిర్మల ప్రసంగిస్తూ జిల్లాస్థాయి వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ ప్రదర్శనలో విద్యార్థులు పాల్గొని వారి మెదడుకు పదును పెట్టుకోడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, ఢిల్లీ ప్రతినిధి కృష్ణ జస్విన్, డీసీఈబీ సెక్రటరీ లలిత్ ప్రసాద్, ఉరూ డీఐ ఖాసిం, సైన్స్ అధికారులు అడుసుమల్లి రవికుమార్, మహమ్మద్ సాదిక్, సైన్స్ కోఆర్డినేటర్లు గౌసుల్ మీరా, పవని భానుచంద్రమూర్తి, సికిందర్ మీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు ఇవే..

గౌరుబోయిన యశస్వి శివసాయి (చేబ్రోలు మండలం. కొత్త రెడ్డిపాలెం కేజీ హైస్కూల్), డి.పీసపాటి మస్తాన్‌రావు (సిరిపురం జిల్లా పరిషత్ హైస్కూల్), షేక్ సనా బుష్రా (నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్ పొన్నూరు), వరగాని తోమరాజు (జడ్పీస్కూల్ గొట్టిపాడు), కొచ్చర్ల శిరీష (జడ్పీ స్కూల్ ముట్లూరు). బాపట్ల జిల్లా నుంచి... సంపతి అమూల్య (జడ్పీస్కూల్, బల్లికురవ), చిరతనగండ్ల అమూల్య (జడ్పీస్కూల్, పావులూరు), చదువుల సింధుజ(జడ్పీస్కూల్, జంపని), ఎల్లల వైష్ణవి (శ్రీ ప్రకాశం గవర్నమెంట్ హైస్కూల్ అద్దంకి) తదితరులు ఈనెల 18న చిత్తూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.



దక్షిణ మధ్య రైల్వే జీఎం నిర్వహించిన వీసీకి హాజరైన డీఆర్‌ఎం రామకృష్ణ

భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో భద్రత ఎంత ముఖ్యమో పరిశుభ్రత కూడా అంతేనని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన సికింద్రాబాద్ హెడ్‌క్వార్టర్స్ నుంచి వివిధ అంశాలపై గుంటూరు డీఆర్‌ఎం ఎం రామకృష్ణతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రైళ్లలో పరిశుభ్రత నిర్వహణపై దృష్టి సారించాలని సూచించారు. రైళ్లలో పరిశుభ్రత వ్యవస్థ ప్రమాణాలను మెరుగుపరచాలన్నారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలను, అగ్నిమాపక సామగ్రి తదితర భద్రతకు సంబంధించిన సామగ్రి లభ్యతపై అధికారులు జనరల్ మేనేజర్‌కు సమాచారాన్ని అందించారు. అనుకోని ప్రతికూల పరిస్థితులు ఎదురైతే అత్యవసర సామగ్రిని డిపోల్లో సరిపడా నిల్వలు ఉంచాలని ఆదేశించారు.

ప్రాజెక్టు ఈఈగా బీఎస్ సుబ్రహ్మణ్యం



ఈఈ బీఎస్ సుబ్రహ్మణ్యాన్ని సన్మానిస్తున్న ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ తదితరులు

రెంటచింతల, ఫిబ్రవరి 12: సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు ఈఈ(సివిల్)గా బీఎస్ సుబ్రహ్మణ్యం సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన విజయవాడ విద్యుత్ సౌదా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి దాకా శ్రీశైలం కుడిగట్టుకు చెందిన రమేష్‌కుమార్ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అందరి సహకారంతో తన విధులను చిత్తశుద్ధితో నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో ఈఈ నాగరాజు, ఏడీఈలు మహ్మద్, గిరిబాబు, జయశంకర్, ఫోర్‌మెన్ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో పలు అభివృద్ధి పనులకు ఆమోదం

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 12: ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఆరేళ్లుగా నిలిచిపోయిన సర్వీస్ బ్లాక్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, సంబంధిత ఏపీ ఎంఎస్‌ఐడీసీ ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. సోమవారం జీజీహెచ్ సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఆయన ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్ష జరిపారు. సర్వీస్ బ్లాక్ నిర్మాణం ఆగిపోయినట్లు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలుపగా, స్పందించిన కృష్ణబాబు, ఏపీ ఎంఎస్ఐడీసీ (మంగళగిరి) ఎండీ మురళీధర్‌రెడ్డిని ఫోన్‌లో సంప్రదించి గుంటూరు జీజీహెచ్ లో సర్వీస్ బ్లాక్ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సర్వీస్ బ్లాక్ నిర్మాణం పూర్తి అయితే ఇందులో స్టీమ్ లాండ్రీ, కిచెన్, ఫార్మసీ స్టోర్, సీటీ స్కాన్ మెషిన్ రూమ్ అందుబాటులోకి వస్తాయి. కాన్పుల వార్డులో మరామ్మతుకు గురైన లిఫ్ట్‌ను రిపేరు చేయించేందుకు కృష్ణబాబు నిధులు విడుదల చేసేందుకు ఆమోదం తెలిపారు. పొదిల ప్రసాద్ బ్లాక్‌పై అదనంగా మరో రెండు అంస్తులు నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

నాట్కో కేన్సర్ సెంటర్‌లో అదనంగా వంద పడకలు

● ప్రభుత్వం, నాట్కో మధ్య కుదిరిన ఒప్పందం

గుంటూరు (మెడికల్), ఫిబ్రవరి 12: ప్రభుత్వ సమగ్రాస్పత్రి నాట్కో కేన్సర్ సెంటర్ ఆసుపత్రికి 1800 అడుగుల స్థలం కేటాయిస్తూ, అందులో 100 పడకలను ఏర్పాటు చేసేందుకు వీలుగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, నాట్కో ట్రస్ట్ మధ్య ఒప్పందం కుదిరింది. సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు చేతుల మీదుగా నాట్కో ట్రస్ట్ సమన్వయకర్తౖ అశోక్‌కుమార్ ఎంవోయూ పత్రాలు అందుకున్నారు. ఆరోగ్య శాఖ, నాట్కో ట్రస్ట్ మధ్య కుదిరిన ఒప్పందంతో, ప్రస్తుతం ఈ స్థలంలో ఉన్న స్టీమ్ లాండ్రీతో పాటు పలు విభాగాలను కొత్తగా నిర్మించే సర్వీస్ బ్లాక్‌లోకి మారుస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాలి

ఐసీడీఎస్ పీడీ ఉమాదేవికి అంగన్‌వాడీల వినతి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 12: అంగన్‌వాడీల సమ్మె విరమణ సందర్భంగా చేసిన ఒప్పందం ప్రకారం సమ్మె కాలం జీతం సహా అన్ని జీవోలను వెంటనే విడుదల చేయాలని ఏపీఅంగన్వాడీ వర్కర్స్ అండ్‌హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ కోరారు. ఈ మేరకు సోమవారం ఐసీడీఎస్ ఉమాదేవి, గుంటూరు అర్బన్ సీడీపీవో కృష్ణవేణిలకు అంగన్‌వాడీలతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం దీప్తిమనోజ మాట్లాడు తూ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని సమస్యను ఉన్నాతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ నాయకులు ముత్యాలరావు, రాధా, చినవెంకాయమ్మ, షేక్ బాజీ తదితరులు ఉన్నారు.



పార్టీలో చేరిన వారితో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ జగన్

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 12: ముఖ్యమంత్రి జగన్ నమ్మకానికి కాదు, నయవంచనకు బ్రాండ్ అంబాసిడర్ అని మాజీమంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. పట్టణంలో 30వ వార్డుకు చెందిన పలువురు ముస్లిం యువకులు సోమవారం టీడీపీలో చేరారు. టీమ్ ఆఫ్ హార్స్ గ్యారేజ్‌కి చెందిన వందమంది యువకులు ప్రత్తిపాటి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారిని ప్రత్తిపాటి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత కుటుంబసభ్యుల నుంచి సాధారణ కార్యకర్తల వరకు ఆ విషయం బోధపడటంతోనే వైసీపీలో ఎవ్వరూ ఇమడ లేకపోతున్నారని ప్రత్తిపాటి ఎద్దేవ చేశారు. జగన్ పాలనలో ఇటు ప్రజలు కాని, అటు వైసీపీ పార్టీలో గాని ఎవ్వరూ సంతృప్తిగా సంక్షేమంతో లేరని, కేవలం జగన్ అతని కోటరీలో కొందరు మాత్రమే వేల కోట్లు వెనకేసుకుంటున్నారన్నది బహిరంగ రహస్యమన్నారు. ఈ పరిస్థితుల్లోనే గత ఎన్నికల్లో పార్టీ కోసం ఆస్తులు అమ్ముకున్నవారు, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అప్పులు తీసుకు వచ్చి పనులు చేసిన వారు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. వారందరినీ గాలికి వదిలి వేసి జగన్ తన స్వార్థం తాను చూసుకుంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోక అనేక మంది వివిధ విపక్ష పార్టీలో చేరుతున్నారన్నారు.



టీడీపీలో చేరిన సుద్ధపల్లి వాసులతో నరేంద్ర కుమార్

వైసీపీని సాగనంపేందుకే
టీడీపీ, జనసేన పొత్తు

చేబ్రోలు, ఫిబ్రవరి12: ఐదేళ్లుగా అరాచక పాలనకు సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకే టీడీపీ, జనసేన పొత్తు అని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. మండలంలోని సుద్దపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. వైసీపీ ఎంపీటీసీ మట్టుపల్లి వెంకటేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, నల్లనూకల గోవింద్, నల్లనూకల వెంకటేశ్వరరావు, దానబోయిన శ్రీనివాసరావు, కాసుల నవీన్, పిల్ల నవీన్ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి నరేంద్రకుమార్ పార్టీ జెండా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పాలనలో గ్రామాలు అధోగతి పాలయ్యాయన్నారు. సుద్దపల్లి గ్రామానికి తాగు, సాగు నీరు అందించే ఎత్తిపోతల పథకాన్ని నిరుపయోగంగా మార్చిన ఘనత వైసీపీ పాలకులది అన్నారు. దోపిడి తప్ప ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోవటం లేదని ధ్వజమెత్తారు. ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీల ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ఎన్నికల తర్వాత ఆయా వర్గాలను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రజల సంక్షేమం కోసం టీడీపీ, జనసేన పార్టీలను గెలిపించాలన్ని నరేంద్ర కుమార్ విజ్ఞప్తి చేసారు. నూతనంగా పార్టీలో చేరిన వెంకటేశ్వరరావు తదితరులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మైలా వెంకట రామరాజు, అనంత లక్ష్మీనారాయణ, వీరంకి రంగారావు, తదితర టీడీపీ నాయకులతో చందోలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీసీసీ ఎన్నికల కమిటీలో పలువురికి స్థానం

గుంటూరు, ఫిబ్రవరి 12: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల చైర్మన్‌గా పలువురు సీనియర్ నేతలతో ఏపీసీసీ ఎన్నికల కమిటీని నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా నియమించిన ఏపీసీసీ ఎన్నికల కమిటీలో పలువురు జిల్లా నేతలకు స్థానం కల్పించటం విశేషం. జిల్లాకు చెందిన కేంద్ర మాజీమంత్రి జేడీ శీలం, ఏఐసీసీ కార్యదర్శి గారా ఉషారాణి, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, ఉడా మాజీ చైర్మన్ వణుకూరి శ్రీనివాసరెడ్డి, ఏపీసీసీ నాయకుడు సూర్యానాయక్‌లకు స్థానంకల్పించారు. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా కాంగ్రెస్ అనుబంధ విభాగాల అధ్యక్షులు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాల్లో పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు టికెట్ల కేటాయింపులపై ఈ కమిటీ సభ్యులు సమీక్షించనున్నట్లు తెలిపారు. ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డికి బాపట్ల ఇన్‌ఛార్జ్‌గా, ఇతర నేతలకు కూడా నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

ఆరు రైళ్ల దారి మళ్లింపు, పాక్షిక రద్దు

గుంటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్గంలో నాన్ ఇంటర్ లాకింగ్, రోల్ కారిడార్ బ్లాక్ పనుల కారనంగా ఆరు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 25 నుంచి 28వ తేదీ వరకు మచిలీపట్నం - ధర్మవరం, మార్చి 26 నుంచి 29వ తేదీ వరకు ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లను విజయవాడ నుంచి తెనాలి, రేణిగుంట, పాకాల మీదగా మళ్లించడం జరుగుతుందన్నారు. అలానే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 25, 27 తేదీల్లో, యశ్వత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 26, 28 తేదీల్లో తెనాలి, రేణిగుంట, మేలపాకం క్యాబిన్, జోలార్‌పెట్టాయి మీదగా మళ్లిస్తామన్నారు. హౌరా - సత్యసాయి ప్రశాంతి నిలయం ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 27న, శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం - హౌరా ఎక్స్‌ప్రెస్‌ని మార్చి 29న గూడూరు, రేణిగుంట, తిరుపతి, పాకాల, ధర్మవరం వరకే నడపడం జరుగుతుందని, అలానే తిరుగు ప్రయాణం ధర్మవరం నుంచి ప్రారంభించడం జరుగుతుందన్నారు.

కృష్ణానదిలో విద్యార్థి మృతదేహం

అచ్చంపేట, ఫిబ్రవరి 12: వేల్పూరు ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి బత్తుల గణేష్(15) మృతి చెందాడు. శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనం తీసుకుని ఇంటి నుంచి వెళ్లాడు. ఎంతకీ తిరిగి రాక పోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందించారు. అనంతరం గణేష్ ద్విచక్ర వాహనం చామర్రులోని కృష్ణా నది వద్ద కన్పించటంతో అనుమాన పడిన బంధువులు కృష్ణా నదిలో వెతికి గణేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1,36,885టిక్కీల విక్రయం

గుంటూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డుకు సోమవారం 1,47,072 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,36,885 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవ సాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకు మాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 89,923 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.33 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

సంక్షిప్త వార్తలు

కర్లపాలెం: బొద్దుకూరివారిపాలెంలో లూథరన్ చర్చి నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే కోన రఘుపతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, పాస్టర్‌లు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

కర్లపాలెం: స్థానిక పాలకేంద్రం వద్ద గల పెద్దింటమ్మ తల్లికి 7వ వార్షికోత్సవ పూజలను సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రసాదాలను పంపిణీ చేశారు.

బాపట్ల: ప్రత్యేకహోదా విభజిత హామీల సత్వర అమలు కొరకు అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్యక్షుడు మేదా శ్రీనివాసరావు కోరారు. ఈ విషయమై సోమవారం ఆ పార్టీ నాయకులతో కలసి స్పందన కార్యక్రమంలో కలెక్టరుకు వినతిపత్రం అందేశారు.

బాపట్ల: బాపట్ల టౌన్ హాల్లో డాక్టర్ వై.ఎస్.కృష్ణమూర్తి 6వ వర్ధంతి కార్యక్రమాన్ని ఫోరంఫర్ బెటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ పీసీ. సాయిబాబు, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాల్యాద్రి, అధ్యాపకులు కృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

కొల్లూరు : స్థానిక పంచాయితీ కార్యాలయ ఆవరణలో మూడు సచివాలయాల పరిధిలోని వలంటీర్లతో పంచాయితీ కార్యదర్శి బీ.మల్లికార్జున సమావేశం నిర్వహించారు. కులగణన సర్వే, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తదితర కార్యక్రమాల నిర్వహణను సమీక్షించారు.



ఆనందబాబు సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

జగన్ తిరోగమన పాలనతో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

● మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

● టీడీపీలో చేరిన మండూరు గ్రామ వైసీపీ నాయకులు, కార్యకర్తలు

చుండూరు ఫిబ్రవరి 12: రాష్ట్రంలో జగన్ సాగిస్తున్న తిరోగమన పాలనతో అన్ని వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అన్నారు. సోమవారం మండూరుకు చెందిన 40 కుటుంబాలకు చెందిన వైసిపి కార్యకరన, నాయకులు సోమవారం గుంటూరులోని ఆనందబాబు క్యాంపు కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ సంక్షేమం ముసుగులో జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి అవకాశాలు లేక కొన్ని లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తానని నమ్మబలికి యువతను నట్టేట ముంచారన్నారు. ప్రతి నెల ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని దీన పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. టీడీపీ హయాంలో చంద్రబాబు ఉద్యోగులకు 43 శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన సంగతిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుతం వలంటీర్లకు ఉన్న గుర్తింపు, ప్రాధాన్యం ప్రభుత్వ అధికారులకు లేదంటే ఆశ్చర్యపడాల్సిన విషయం కాదన్నారు. నాఎస్టీలు, నా ఎస్సీలు అంటూ దీర్ఘాలు పలికే జగన్ ఆవర్గాల ప్రజా ప్రతినిధులకు అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా ఆయన ఇంటి గేట్ల ముందర పడిగాపులు పడేలా చేస్తున్న విషయం ప్రజలకు తెలియనిది కాదన్నారు. అధికారంలోకి వచ్చాక దశల వారీగా మద్యాన్ని నిషేదిస్తానని హామీ ఇచ్చి, ఇప్పుడు వాటి అమ్మకాల్లో రికార్డులు సృష్టించాడు. అర్ధరాత్రి 1 గంటకు కూడా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నారన్నారు. మద్యం ద్వారా వచ్చే ఆదాయంతోనే రాష్ట్రాన్ని పాలించడం సిగ్గు పడాల్సిన విషయమన్నారు. అలాగే గంజాయి అమ్మకాలు గ్రామ స్థాయికి చేరాయన్నారు. తల్లి, చెల్లిని కుటుంబం నుండి దూరం చేయడంతో పాటు బాబాయి కుమార్తె సునీత ప్రాణరక్షణ కోరడం జగన్‌రెడ్డి సైకో మనస్తత్వాన్ని అద్దం పడుతుందన్నారు. రాష్ట్రంలో తిరిగి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలనే గట్టి తలంపుతోనే పెద్ద ఎత్తున ప్రజలు తెలుగుదేశానికి మద్దతు తెలుపుతున్నారని ఆనందబాబు తెలిపారు. కార్యక్రమంలో జొన్నకూటి సాంబశివరావు, రెడ్డి ధనుంజయ, తాడిశెట్టి బాబు, గుండాల వెంకటేశ్వర్లు, సంసోన్, వీఎస్‌కె ప్రసాద్, దేవిరెడ్డి నాగేశ్వరరావు, కుర్రి వెంకటరెడ్డి, మన్నవ రాజశేఖర్, చెక్కా బుచ్చయ్య, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్నేహపూర్వకంగా మెలగాలి

కొల్లూరు, ఫిబ్రవరి 12 : గ్రామంలో ప్రజలంతా స్నేహ పూర్వకంగా మెలగాలని ఎస్‌ఐ రవీంద్రారెడ్డి సూచించారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని మొసలిపాడు గ్రామంలోని ప్రజలతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా గ్రామంలో పోలీసుశాఖ పరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. గొడవలు పడకుండా గ్రామంలో కలిసిమెలిసి జీవించాలని ఆయన పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామం శాంతియుత వాతావరణం నెలకొనేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఇటీవల నారా భువనేశ్వరి పర్యటనలో చోరికి గురైన చరవాణిని గుర్తించి ఈపూరుకు చెందిన బంగారు సంగీతరావుకు అప్పగించారు.



రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలరావు

చీకటి జీవోను రద్దు చెయ్యాలి

● బార్ అసోసియేషన్ అద్యక్షుడు కేసన గోపాలరావు

రేపల్లె, ఫిబ్రవరి 12 : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ప్రభుత్వం పునరాలోచించి ఉపసంహరించాలని బార్ అసోసియేషన్ అద్యక్షుడు కేసన గోపాలరావు అన్నారు. సోమవారానికి న్యాయవాదులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష 38వ రోజుకు చేరింది. న్యాయవాదుల దీక్షకు మద్దతుగా రేపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలో జనసేన పట్టణ అద్యక్షులు రాసంశెట్టి మహేష్, దేవగిరి శంకర్, రేపల్లె జానకయ్య, ఇంతియాజ్, తోట లంకేశ్వరరావు, యార్లగడ్డ రవి, కొక్కిలిగడ్డ వంశీకృష్ణ, మాదాసు బాబి, మర్రిశెట్టి సాయి నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 38రోజులుగా రిలే నిరాహారదీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర పోతుందన్నారు. ప్రజలందరూ చైతన్యవంతులై ఇటువంటి చట్టాల వలన జరిగే నష్టం గ్రహించి న్యాయవాదులు చేస్తున్నదీక్షకు చేయి చేయి కలిపి నడింబిగించాలని ఆయన కోరారు. రాక్షస ప్రభుత్వం అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల కాలంలో ప్రజా వ్యతిరేక విధానాలకు మాత్రమే తీసుకుంటుందని, ప్రజలకు ఉపయోగపడే చట్టాలను చేయటం కుదరదని ఎటువంటి ప్రభుత్వాన్ని ప్రజలందరూ ఐక్యంగా పోరాడి ఇంటికి పంపించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదు కొలుసు రామారావు, అనగాని శ్రీనివాసమూర్తి, దారం సాంబశివరావు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను అమ్మకాలు చేస్తున్న ఏవో బాలాజీ గంగాధర్

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

చెరుకుపల్లి, ఫిబ్రవరి 12: ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఏవో టి.బాలాజీ గంగాధర్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. ఏవో మాట్లాడుతూ రసాయనిక మందులు వాడని కూరగాయలు, వరి ధాన్యాన్ని ప్రజలు రోజూవారీ ఆహారంగా తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యం శ్రేష్ఠంగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది జ్యోతి, తెలుగువెలుగు ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు, ఎఎస్‌లు శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, ఐసీఆర్పీఎస్ సిబ్బంది కోటేశ్వరరావు, నాగిరెరడద్ది, శిరీషాలక్ష్మీ పాల్గొన్నారు.

అధికారులు పనితీరు మార్చుకోవాలి

● సర్వేశాఖ అధికారులకు కలెక్టర్ పి.రంజిత్‌బాషా హెచ్చరిక

● స్పందనలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

● అర్జీలు పునారావృతం కాకుండా చూడాలని ఆదేశం



అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల, ఫిబ్రవరి 12 : జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వేశాఖ అధికారులు వారి పని తీరు మార్చుకోవాలని కలెక్టర్ పీ.రంజిత్‌బాష హెచ్చరించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన ప్రజలు అంద జేసిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో భూముల సర్వే సమస్యలపైనే ఎక్కువ అర్జీలు నమోదు అవుతున్నాయని, క్షేత్ర స్థాయిలో సర్వేయర్లు సక్రమంగా విధులు నిర్వహించక పోవటం వలనే ఈ సమస్య ఉత్పన్నమౌతుందన్నారు. ప్రజల అర్జీలపై నిర్లిప్తంగా వ్యవహరించే సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలు గడువు తీరినప్పటికి పరిశీలించకపోతే సంబంధితశాఖాధికారులను బాధ్యులుగా చేయాల్సి ఉంటుందని, వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామన్నారు. కులగణన నమోదు ప్రక్రియను వేగవంతం చేపట్టాలని, ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలన్నారు. 'పౌరహక్కుల దినం' కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాలలో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పీ.వెంకటరమణ, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలు చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలి

- అడిషనల్ ఎస్పీ పీ.మహేష్

స్పందన అర్జీలు చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీసు అధికారులను అడిషనల్ ఎస్పీ పీ.మహేష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకొని అర్జీలు స్వీకరించి, పరిష్కరించాలని ఆయా స్టేషన్‌ల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ కలహాలు, భూవివాదాలు, ఇతర సమస్యలపై మొత్తం 48 ఫిర్యాదలు అందిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.సింగయ్య, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో ప్రతి కార్యకర్తకు సముచిత స్థానం

● రానున్నది టీడీపీ - జనసేన ప్రభుత్వమే..

● రేపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

● వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు



ఆరుంబాక గ్రామానికి చెందిన వైసీపీ నాయకులకు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్

రేపల్లె, ఫిబ్రవరి 12: పార్టీలోకి చేరిన ప్రతి కార్యకర్త, నాయకుడికి సముచిత స్థానం కల్పించి, వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం చెరుకుపల్లి మండలం ఆరుంబాక పంచాయతీకి చెందిన వేణుగోపాలస్వామిగుడి ఛైర్మన్ రావూరి వెంకటేశ్వరరావు, వైస్ ఛైర్మన్ మొహమాటం మారుతి, వార్డు సభ్యులు పూల సాంబశివరావు, వసుంధర, వెంకటనాగసాయి, పూల శ్రీకాంత్, వెంకటహరి, నాగరాజు, గోపినాథ్, మోహన్, వెంకట్రావు, వారితో పాటు వైసీపీకి చెందిన 25 కుటుంబాల వారు మొహమాటం రాధాకృష్ణమూర్తి, మల్లాది రామకృష్ణల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. వారిని ఎమ్మెల్యే అనగాని పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల పాటు ప్రతి కార్యకర్త, నాయకులు సైనికుల్లా పనిచేస్తే ఐదేళ్ల పాటు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతోపాటు, మీకు అండగా ఉండే బాధ్యత తనదని అన్నారు. రానున్నది టీడీపీ, జనసేన సంయుక్త ప్రభుత్వమేనని, ప్రజలెవ్వరు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. జగన్‌రెడ్డి పాలన ఇవే ఇక చివరి రోజులని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని మురళీధరరావు, గూడపాటి శ్రీనివాసరావు, జనసేన పట్టణ అధ్యక్షులు రాసంశెట్టి మహేష్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో విద్యార్థులతో మాట్లాడుతున్న డాక్టర్ విశాలాక్షి

మానసిక ఒత్తిడిని జయించండి

● విద్యార్థులతో ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ విశాలాక్షి

వేమూరు, ఫిబ్రవరి 12: మానసిక ఒత్తిడిని జయించడం ద్వారా విద్యార్థులు పరీక్షలను సమర్థవంతంగా ఎదుర్కోవడంతో పాటు మంచి ఫలితాలు సాధిస్తారని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ జంపాల విశాలాక్షి తెలిపారు. సోమవారం వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్ట్రెస్ మేనేజ్మెంట్, మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ విశాలాక్షి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఒత్తిడిలను అధిగమించే అనేక ఉపాయాలను వివరించారు. అలాగే డాక్టర్ మురళీకృష్ణ పరీక్షల్లో అవసరమైన సాంకేతిక విషయాలను, ఏబీటీఏ తేజ పరీక్షలు రాసే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంఈవో-2 రోజుల్యాండ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్యాంకుమార్, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి సురేష్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ ఖర్చును అందజేస్తాం

బాపట్ల, ఫిబ్రవరి 12 : స్థానిక చీలురోడ్డుసెంటర్‌లోని రామాలయ ప్రహరీ ఇటీవల మిచౌంగ్ తుఫాన్‌కు కూలిపోగా సోమవారం జనసేన పార్టీ నేతలు ఆ ప్రహరీని పరిశీలించారు. ఈ సందర్భంగా జనసేనపార్టీ ఉమ్మడి గుంటూరుజిల్లా కార్యదర్శి గుంటుపల్లి తులసీకుమారి మాట్లాడుతూ రామాలయ ప్రహరీ నిర్మాణ ఖర్చును జనసేన పార్టీ తరపున తామే అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో జనసేన నాయకులు గొట్టిపాటి శ్రీకృష్ణ, హుస్సేన్‌బేగ్, సురేంద్రబాబు, సత్తార్, అంజనేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలను నిలువరించండి

కొల్లూరు, ఫిబ్రవరి 12 : వాల్టా చట్టానికి విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని పెదలంక, చింతల్లంక గ్రామస్తులు స్పందనలో అధికారులు వినతి పత్రాలు అందించారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పెదలంక, చింతల్లంక గ్రామస్తులు హాజరై పెదలంక గ్రామ రెవెన్యూ పరిధిలో భారీ యంత్రాలతో వాల్టా చట్టం క్లాజ్-23కు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల పంట పొలాలు, నివాస ప్రాంతాలతో పాటు అరవింద వంతెన కోతకు గురయ్యే ప్రమాదం పొంచి వుందన్నారు. భూగర్భ జలాలు సైతం అడుగంటిపోయి సాగు, తాగు నీరు కష్టాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని, చట్టవ్యతిరేకంగా జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలను వెంటనే నిలిపివేసి యంత్రాలను స్వాధీనపరచుకోవాలని, ఇప్పటి వరకు ఎన్ని క్యూబిక్ మీటర్లు ఇసుక మేటలు తవ్వారో విచారణ జరిపి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ర్యాంప్ అనుమతి ఇచ్చిన నదీ పరివాహక శాఖ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

పాఠశాలల్లో వార్షిక తనిఖీలు

పిట్టలవానిపాలెం, ఫిబ్రవరి 12 : అలకాపురం గ్రామ పంచాయతీలోని మండేవారిపాలెం, సత్యనారాయణపురం గ్రామాల్లోగల ప్రాథమిక పాఠశాలలను వార్షిక తనిఖీల్లో భాగంగా ఎంఈవో-1 ఉయ్యూరి వెంకటేశ్వరరావు సోమవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న మౌలికసదుపాయాలను సక్రమంగా అందేలా చూడాలన్నారు. జగనన్న గోరుముద్ద, యూనిఫామ్స్, పాఠ్య పుస్తకాలు సక్రమంగా అందేలా చూచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెంచురామయ్య, యువీ అనంతరామ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

చెరుకుపల్లి, ఫిబ్రవరి 12: మార్కండేయస్వామి జయంతి వేడుకలను చెరుకుపల్లి, గుళ్ళపల్లి గ్రామాల్లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మార్కండేయస్వామి పద్మశాలీయుల ఆరాధ్య దైవమని అన్నారు. అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దివి రాంబాబు, కందుల రామమోహన్‌రావు, పెనుమర్తి రత్తయ్య, కౌతరపు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తకు పరామర్శ

కొల్లూరు, ఫిబ్రవరి 12 : పాముకాటుకు గురై వైద్యశాలలో చికిత్స పొందుతున్న పార్టీ కార్యకర్తను మాజీ మంత్రి, పొలిట్‌బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు సోమవారం పరామర్శించారు. మండల పరిధిలోని కిష్కిందపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పులివర్తి చినఆనందం పాముకాటుకు గురై వడ్లమూడిలోని డీవీసీ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి వైద్యశాలకు వెళ్లి కార్యకర్తను పరామర్శించారు. అనంతరం వైద్యులతో కార్యకర్త ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని ఆయన సూచించారు.

కోన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

బాపట్ల,ఫిబ్రవరి 12 : ఇటీవల బాపట్ల పర్యటనకు వచ్చిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను చులక చేసేలా మాట్లాడిన ఎమ్మెల్యే కోన రఘుపతి ఆయన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవానలి కాంగ్రెస్‌పార్టీ జిల్లా మైనార్టీసెల్ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 'వైఎస్. కుమార్తె కనుకనే షర్మిలను ఊరు దాటనిచ్చాం' అని కోన మాట్లాడటం సరైంది కాదన్నారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు దోనేపూడి దేవరాజు, శంకర్‌రెడ్డి, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

14న అధికజన మహా సంకల్ప సభ

బాపట్ల, ఫిబ్రవరి 12 : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట బైబిల్‌మిషన్ ప్రాంగణంలో ఈనెల 14న సాయంత్రం 4గంటలకు జరిగే అధికజన మహాసంకల్ప సభను జయప్రదం చేయాలని విజయపథం సభ్యులు పిలుపునిచ్చారు. సోమవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో సభ కరపత్రాలను ఆవిష్కరించారు. దళాధిపతి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు ప్రతి ఒక్కరు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో సుభాష్‌దినకర్, అరుంధతిరాజు, డాక్టర్‌బాబు పాల్గొన్నారు.



స్థానిక జీడీసీసీ బ్యాంక్ ముందు సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు

ప్రమాదంలో ప్రజారోగ్యం

● అధ్వాన పారిశుధ్యంతో విజృంభిస్తున్న దోమలు

● రోగాల బారిన పడుతున్న ప్రజలు

● చోద్యం చూస్తున్న పంచాయితీ అధికారులు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 12 : అధికారుల అలసత్వం, అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ కారణంగా మండల కేంద్రం భట్టిప్రోలులో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో దోమలు విజృంభిస్తూ ప్రజలపై దాడి చేస్తూ కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని ప్రధాన రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తూ ఉన్నప్పటికీ పంచాయితీ అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. వర్షం కురిస్తే ఆ రహదారి పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. డ్రెయినేజీ నీరు వర్షం నీటితో కలిసి రహదారిపై ప్రవహిస్తుంది. ఒక ప్రక్క కాలువల్లో ముందుకు కదలని మురుగుతో భరించలేని దుర్గంధం, విజృంభిస్తున్న దోమలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

16 వార్డులు కలిగిన మేజర్ పంచాయితీ భట్టిప్రోలులో సుమారు 18 వేల జనాభా నివాసం ఉంటున్నారు. మేజర్ పంచాయతీకి ఆదాయం ఘనంగా ఉన్నప్పటికి పారిశుధ్య నిర్వహణలో మాత్రం వెనుకంజలో ఉంది. కోట్లాది రూపాయిల ప్రజాధనంతో నిర్మించిన డ్రెయినేజ వ్యవస్థ నిరుపయోగంగా మారడంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచి ఉంటుంది. దీంతో దోమల ఉధృతి పెరిగి ప్రజలు రోగాలబారిన పడేలా చేస్తున్నాయి.



స్థానిక లైబ్రరీ ముందు మురుగు కాలువ దుస్థితి

నిరుపయోగంగా మారిన కల్వర్టులు ..

ఇటీవల వివిధ వార్డుల్లో నిర్మించిన కల్వర్టులు నిరుపయోగంగా మారాయి. మెయిన్‌రోడ్డుతో పాటుగా రైలుపేట, కొత్తపేట, మార్కెట్ వెనుకబజార్‌లతో పాటుగా ఎస్సీ కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోజుల తరబడి మురుగునీరు ముందుకు కదలక రంగుమారి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందని ఇళ్ళల్లో నివసించ లేకపోతున్నామని ఆయా వార్డుల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం డ్రెయినేజీ నిర్మించారో అర్థం కాని పరిస్థితి నెలకొందని, ఒక్క వార్డు అంటే ఒక్క వార్డులో కూడా మురుగు నీరు ముందుకు కదలటం లేదని, అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మేజర్ పంచాయతీ భట్టిప్రోలులో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులను నిర్వహించి, తమను రోగాల బారి నుంచి కాపాడాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



టీడీపీలో చేరిన వారితో వేగేశన నరేంద్రవర్మ

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

● పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 12: పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు సోమవారం టీడీపీలో చేరారు. బాపట్ల టీడీపీ కార్యాలయంలో వారికి టీడీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన ఎ.చంద్రశేఖరరెడ్డి, గోపిరెడ్డి, భూపతిరెడ్డి, శంకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, ఎన్.నాగరాజు, కె.వెంకటేశ్వర్లు, ఎన్.మురళీ, వినయ్, సుధాకర్, శాంతారావులు బాపట్లలో నరేంద్రవర్మ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కనుమూరి సాంబమూర్తిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అప్జల్, సీనియర్ నాయకులు వెంకటపతిరాజు, నాగరాజు, రవిరాజు, మేకా సుబ్బారావు, కొక్కిలి వెంకటకృష్ణ, పీ.శ్రీను, భాస్కర్, బేతాళం రామరాజు, రాష్ట్రపార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు ఎస్‌ఐగా శ్రీనివాసరావు



ఎస్‌ఐ శ్రీనివాసరావు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 12 : భట్టిప్రోలు మండల ఎస్‌ఐగా కె. శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు ఎస్‌ఐగా పని చేస్తూ ఎన్నికల బదిలీలలో భాగంగా బాపట్ల వీఆర్ నుండి భట్టిప్రోలుకు విచ్చేశారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పని చేసిన అంబటి చంద్రశేఖర్ ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్ళారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా జరిగేలా కృషి చేస్తానన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ఎటువంటి అల్లర్లు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. పార్టీలకు అతీతంగా విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తానని శ్రీనివాసరావు తెలియజేశారు. స్టేషన్ సిబ్బంది నూతన ఎస్‌ఐ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ..'

రేపల్లె, ఫిబ్రవరి 12: రేపల్లె నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో టీడీపీ నేతలు, ఆపార్టీ శ్రేణులు బాబుష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. సోమవారం రేపల్లె మండలం బొందలగరువులో నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ అరాచక పాలన తీరును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు రేపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఇచ్చే చిల్లరకు కక్కుర్తిపడి పేటీఎం బ్యాచ్ సామాజిక మాధ్యమాల్లో కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు కుటిలయత్నాలకు పాల్పడుతుందని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. గ్రామాల్లో వలెంటీర్లు, సచివాలయ సిబ్బంది వైసీపీకి అనుకూలంగా ఉంటూ ఓటర్లు ప్రభావితం చేసేలా వ్యవహరిస్తున్నారి ఆరోపించారు. వైసీపీ నాలుగున్నర పాలనలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందని, టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి బాట పడుతుందన్నారు. కార్యక్రమంలో వడ్డి లక్ష్మీజీ, మునిసుబ్బారావు, వీరయ్య, మురహరిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపల్లె పట్టణంలోని 2, 3వార్డుల్లో .. బాబూ ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ టీడీపీ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 3వవార్డు ఇన్‌చార్జి దామెర్ల రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌ను గద్దెదించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ,రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గోగినేని పట్టాభిరామారావు, జీవీ నాగేశ్వరరావు, డొక్కు బుజ్జి, దేవగిరి రంగా, పంతాని సాయికుమార్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బొందలగరువు గ్రామంలో టీడీపీ నాయకుల ప్రచారం..



రేపల్లె పట్టణంలోని 2,3వార్డుల్లో టీడీపీ, జనసేన నేతల ప్రచారం..



కామినేనివారిపాలెం, ఆరుంబాక ఎస్సీ కాలనీలో..

చెరుకుపల్లి: మండలంలోని ఆరుంబాక పంచాయతీలోని కామినేనివారిపాలెం, కనగాల గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ' కార్యక్రమాన్ని 2వ రోజూ నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలను తెలుసుకుని సైకిల్ గుర్తుకు ఓటువేసి చంద్రబాబును సీఎంని చెయ్యాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జీలు మొహమాటం రాధాకృష్ణమూర్తి, వుయ్యూరు శివ, ఈపూరి దుర్గాప్రసాద్, వేము సోమయ్య, బొలగాని సుబ్బారావు, రవి, గోగినేని రామాంజనేయులు, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

- రెండు నెలల్లో జగన్ ఇంటికే!
- టీడీపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

బల్లికురవ, ఫిబ్రవరి 12: రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే తిరిగి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు రావల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. సోమవారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు టీడీపీలో చేరారు. బల్లికురవ మండలం గొర్రెపాడు గ్రామానికి చెందిన 60 కుటుంబాలు వైసీపీని వీడి రవికుమార్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన రోజునుంచే ఏపీ సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. ప్రజావేదిక కూల్చివేత నుంచి పన్నుల బాదుడుతో నిరుపేదలను నమ్మించేలా మాయమాటలు చెప్పి అన్నివర్గాల ప్రజలకు విసుగు కలిగించేలా జగన్ పాలన సాగిందన్నారు. మరో రెండు నెలల్లో జగన్ రెడ్డి ఇంటికి పోవటం తథ్యమని చెప్పారు. వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. దళితులకు గత టీడీపీ ప్రభుత్వం అందించిన వంద పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల కుప్పగా మార్చి ప్రతి ఒక్కరిపై లక్షల్లో అప్పులు చేశారని రవికుమార్ ఆరోపించారు. మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి మాట తప్పి మహిళలను మోసం చేశారని అన్నారు. టీడీపీ కార్యకర్తలు రెండు నెలల పాటు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఇంటింటికి తిరిగి ప్రజలందరికి లబ్ధి చేకురేలా టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో పార్టీలో చేరిన గొర్రెపాడు నేతలు మక్కెన స్వాములు, రాయల అంకమ్మరావు, గుంటూరు వెంకట్రామయ్య, మక్కెన సత్యనారాయణ, గొల్లపూడి చిన్న, జంధ్రాజుపల్లి పూర్ణయ్య, గుమ్మడెల చిన్నఅంజయ్య, మెట్ల దానారావు, గుంటూరు గిరిబాబు, ఏలూరి నారాయణ, మక్కెన వెంకటేశ్వర్లు, కల్లూరి ఆశోక్, తదితరులు పాల్గొన్నారు.


బల్లికురవ: ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ గొర్రెపాడు నేతలు, కార్యకర్తలు


అద్దంకి: ఎమ్మెల్యే రవికుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన వెంపరాల కాలనీ మహిళలు, వైసీపీ నేతలు

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

అద్దంకి, ఫిబ్రవరి 12: రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పాలనను గాడిలో పెట్టాలంటే చంద్రబాబునాయుడుకే సాధ్యమని చెప్పారు. మండలంలోని వెంపరాల ఎస్సీ కాలనీకి చెందిన పలువురు వైసీపీ నేతలు, ఆయా కుటుంబాల సభ్యులు, మహిళలతో పుట్టావారిపాలెం వద్ద ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు వెళ్లి టీడీపీ లో చేరారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించటంతో పలు పథకాలకు నిధులులేకుండా పోయాయన్నారు. దాచుకోవటం, దోచుకోవటం మినహా రాష్ట్రానికి జగన్‌మోహన్‌రెడ్డి చేసిందేమి లేదన్నారు. సీఎం పదవికి జగన్ అనర్హుడన్నారు. ఒక్క చాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారన్నారు. రాబోయే ఎన్నికలలో వైసీపీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు చం ద్రబాబునాయుడుని గెలిపించి రాష్ట్ర భవిష్యత్ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

టీడీపీలో చేరిన వారిలో మున్నంగి బాబూరావు, మున్నంగి నాగేష్, గరిగల అంకయ్య, డేవిడ్, అబ్రహం, ఆనందరావు, ఎడ్లపల్లి నగేష్‌బాబు, మందా దేవసహాయం తదితరులతో పాటు ఆయా కుటుంబసభ్యులు, మహిళలు ఉన్నారు.


బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ ప్రచారంలో టీడీపీ శ్రేణులు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

చీరాల, ఫిబ్రవరి 12: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య తనయుడు గౌరిఅమర్‌నాథ్ అన్నారు. స్థానిక 25వ వార్డులో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి కావల్సిన అవసరం ఉందన్నారు. లేదంటే రాష్ట్రం అంధకారంలోకి పోతుందన్నారు. వైసీపీ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లోకేష్ శంఖారావానికి ప్రజల నుంచి అశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు

చీరాల, ఫిబ్రవరి 12: సెయింట్‌ఆన్స్ కళాశాలలో ఇటీవల (24క్షై7)ఏఐ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో 8 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు చెప్పారు. ఈసందర్భంగా సోమవారం కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొయిద వేణుగోపాలరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు జరిగిన ఎంపిక ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నాగేశ్వరరావు సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ పి.హరిణి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ కె.జగదీష్‌బాబు, ఏఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ సి.హరికిషన్, ఐవోటీ విభాగాధిపతి డాక్టర్ ఎస్. ఇంద్రనీల్, కళాశాల అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్వీ రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల, ఫిబ్రవరి 12: నియోజకవర్గంలో సమస్యలన్నింటినీ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నట్టు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. స్థానిక 3వ వార్డులో రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైయిన్లను మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలసి ఎమ్మెల్యే బలరాం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొనిగల జైసన్ బాబు, కలవకూరి యానాదిరావు, షేక్ సలీమ్, ప్రతాప్, కంకణాల నాని, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకరరావు, ప్రసాద్‌రెడ్డి, డీఈ ఏసయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు చర్యలు

పంగులూరు, ఫిబ్రవరి 12:సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో మ్యాథ్యూబాబు తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని 21 గ్రామ పంచాయితీల పరిధిలో మొత్తం 49 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు చెప్పారు. ఈ కేంద్రాలలో 39,020 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రాలవద్ద ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ సౌకర్యం, కిటికీలు, తలుపులకు తగిన మరమ్మతులు చేపడుతున్నట్లు చెప్పారు.

18న విజయానందతీర్థ అద్దంకి రాక

అద్దంకి, ఫిబ్రవరి 12: మైసూరు అవధూత దత్తపీఠం ఉత్తరాధికారి దత్త విజయానందతీర్థ స్వామీజీ ఈనెల 18న అద్దంకి రానున్నట్లు దత్తపాదుకాక్షేత్రం ట్రస్టీ చైర్మన్ నాగసూరి హనుమత్ తెలిపారు. సోమవారం స్థానిక దత్తపాదుకాక్షేత్రంలో వివరాలు వెల్లడించారు. 18వ తేది ఉదయం 9 గంటలకు సౌరహోమం, తైలాభిషేకం, అనుగ్రహ బాషణం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు శ్రీచక్రార్చన, దివ్యనామ సంకీర్తన జరుగుతుందన్నారు. ట్రస్టీ చైర్మన్ నాగసూరి హనుమత్ ప్రసాద్, కార్యదర్శి రామకృష్ణారావు, కురిచేటి సుబ్బారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, ఒబ్బినీడి సుబ్బారావు, మామిడి రాంబాబు, చామర్తి వెంకటరావు, మల్లికార్జునరావు, తమ్మన శ్రీనివాసరావు, ఆత్మకూరి పెదఆంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

అక్రమంగా ఇచ్చిన పట్టాలను రద్దు చేయాలి

చీరాల, ఫిబ్రవరి 12: వేటపాలెం మండలం సిలోన్ కాలనీలో పలువురికి అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా రిటైర్డ్ తహసీల్దార్ ఇచ్చిన నివేశన స్థల పట్టాలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం బాధ్యుడు కొండయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సిలోన్ కాలనీకి చెందిన పలువురు నిరాహారదీక్ష చేపట్టారు ఈసందర్భంగా కొండయ్య మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి ఎలా పట్టాలు ఇస్తారని ప్రశ్నించారు. ఈక్రమంలో కొందరు స్పందన కార్యక్రమంలో కలెక్టర్ రంజిత్ బాషాకు ఇదే విషయమై అర్జీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో సూర్యప్రకాష్‌రెడ్డి దీక్ష చేపట్టిన వారితో మాట్లాడారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో దీక్షను విరమించారు. కార్యక్రమంలో శివనాడియన్, సత్తివేలు, కర్ణ, వినోద్, సెల్వరాజ్, రాణి, సెల్వి, తదితరులు పాల్గొన్నారు.

రేపు బల్లికురవకు కలెక్టర్ రాక

బల్లికురవ, ఫిబ్రవరి 12: ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం బుధవారం బల్లికురవలో జరగనుంది. ఈకార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా రానున్నారు. మండలంలోని అన్నిగ్రామాల్లో ప్రజలు తమ సమస్యలు చెప్పుకొనేందుకు తరలిరావాలని గ్రామస్థాయి అధికారులకు సమాచారం అందిస్తున్నారు.

ప్రపంచ మేధావి అంబేడ్కర్


అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్యే బలరాం తదితరులు

చీరాల, ఫిబ్రవరి 12: డాక్టర్ అంబేడ్కర్ ప్రపంచ మేధావి అని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఆయన సిద్ధాంతాలతో మమేకమై నడుస్తున్న కోట్ల మంది ప్రజలు అందుకు నిదర్శనమని చెప్పారు స్థానిక ముక్కోణపు పార్కు సెంటర్లో రూ.30 లక్షలతో నిర్మించిన అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో అత్యున్నత గుర్తింపు పొందిన వ్యక్తుల్లో అంబేడ్కర్ మొదటి వరుసలో ఉంటారన్నారు. ఆయన ప్రతిఒక్కరి మదిలో గుర్తుంటారన్నారు. ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ మున్సిపల్ వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ సమిష్టి కృషి ఫలితంగా కాంస్యవిగ్రహం రూపుదిద్దుకుందన్నారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించటం ప్రతిఒక్కరి ధర్మమన్నారు. ముందుగా అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం పలువురు దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే బలరాంను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, పలు సంఘాల ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక విద్యాబోధనకు స్మార్ట్ డిజిటల్ దోహదం


బధిరుల పాఠశాలలో మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

పర్చూరు, ఫిబ్రవరి 12: చెవిటి, మూగ విద్యార్థులకు అధునిక విద్యాబోధన అందించేందుకు స్మార్ట్ డిజిటల్ ఎంతగానో దోహద పడుతుందని పీడీజీ తాళ్ల రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాగులపాలెం గ్రామ పంచాయతీ నాగుబడి రంగయ్య అచ్చమ్మ బదిరుల పాఠశాలలో హైదరాబాద్ డెక్కన్ అనుబంధ సంస్థ డేర్ ప్రాజెక్ట్ సహకారంతో రూ.2.15 లక్షల వ్యయంతో నిర్మాణం చేసిన స్మార్ట్ డిజిటల్ తరగతి గదిని రోటరీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలే లక్ష్యంగా పర్చూరు రోటరీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. డెక్కన్ క్లబ్ గతంలో పబ్లిక్ టాయిలేట్స్‌కు రూ.లక్షా 15 వేలు అందించినట్లు చెప్పారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామ వికాస్ కార్యక్రమంలో భాగంగా నాగులపాలెం ఆర్‌సీసీ సహకారంతో లక్షల విలువ చేసే రోడ్లతోపాటు, మంచినీటి చెరువుపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటుచేయటం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకట్రామయ్య, రోటరీ కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోశాధికారి కోమటి ఆంజనేయులు, రోటరీ సభ్యులు, పాఠశాల యాజమాన్యం, తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన కలిగిఉండాలి


భద్రతా వారోత్సవాల సందర్భంగా దగ్గర ఉండి పనులు చేయిస్తున్న పీడీ శివకుమార్, అధికారులు

మేదరమెట్ల , ఫిబ్రవరి 12: జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులు, దుకాణదారులు రహదారి భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సింహపురి ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు హెడ్ శివకుమార్ అన్నారు. సోమవారం 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా తిమ్మనపాలెం, గ్రోత్ సెంటర్ వద్ద తమ సిబ్బందితో రోడ్డు మార్కింగ్, రోడ్డు బ్లింకింగ్ పాటు పరిస రాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిలో దుకాణాల ముందు వాహనాలు ఆపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీనిపై దుకాణదారులకు అవగాహన కల్పించారన్నారు. అత్యవసర సమయంలో కంట్రోల్ రూమ్ నెంబరు 8096999057, ఎమర్జెన్సీ నెంబర్ 1033, అంబులెన్స్ నెంబర్ 8086999039, 8096999059లకు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చునని చెప్పారు. ఈ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మెయింటెన్స్ మేనేజర్ విజయభాస్కర్, ఇంజనీర్లు గాంధీ, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన కేజీబీవీ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

చినగంజాం, ఫిబ్రవరి 12: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కస్తుర్భాగాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి తెలిపారు. స్థానిక కేజీబీవీలో పీడీ ఎస్.వాణిశ్రీ అధ్యక్షతన సోమవారం జాతీమస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులకు అభినంద సభ జరిగింది. ఇటీవల కడవకుదురు జడ్పీ పాఠశాలలో అండర్-14 విభాగంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో బి.ప్రజ్ఞ(8వ తరగతి) లాంగ్ జంప్, ఎం.జెస్సీ(8వ తరగతి) 200 మీటర్ల పరుగు పందెం, డి.సింధు(7వ తరగతి) 600 మీటర్ల పరుగుపందెంలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈనెల 16 నుంచి 18 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరిగే 19వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్, పీడీ., ఉపాధ్యాయినులు అభినందనలు తెలిపారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్

అద్దంకి, ఫిబ్రవరి 12: గంజాయితో వెళ్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ కృష్ణయ్య తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన నాదెండ్ల ఇమామ్ బాషా, ప్రొద్దుటూరుకు చెందిన గాదంశెట్టి జీవన్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటుపడి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశంతో గంజాయి కొనుగోలు చేసి ప్యాకెట్‌లలో ఉంచి అమ్మకాలు చేస్తున్నారు. ఆ డబ్బులతో జల్సాలు చేయటానికి ప్రొద్దుటూరు నుంచి విజయవాడ వెళ్ళటానికి అద్దంకి పట్టణంలోని భవానిసెంటర్‌లో ఉన్నారు. పోలీసులకు సమాచారం రావటం తో ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఇద్దరిని కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

ఎస్ఐగా రత్నకుమారి.. అద్దంకి పట్టణ పోలీస్ స్టేషన్‌లో రత్నకుమారి ఎస్సై గా సోమవారం చేరారు. చీరాల 2 టౌన్ నుండి బదిలీ పై అద్దంకి వచ్చారు. సిఐ కృష్ణయ్య ను కలిసి విధులలో చేరారు.

ఆగిఉన్న వాహనాన్ని బైకు ఢీకొని ఇద్దరికి గాయాలు

చినగంజాం, ఫిబ్రవరి 12: ఆగిఉన్న వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన కడవకుదురు గ్రామ సమీపంలోని 216వ నెంబరు జాతీయ రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కలిదిండి మండలం తాడినాడ నుంచి వాహనం ఒంగోలుకు రొయ్యల పిల్లల కోసం వెళ్తుంది. వాహనం డ్రైవర్ పొలిమెట్ల మురళీరాజు కడవకుదురు సమీపంలోని జాతీయ రహదారి పక్కన నిలిపాడు. ఈక్రమంలో చీరాల నుంచి చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పూలవారిపాలెం గ్రామానికి ద్విచక్రవాహనంపై మాదాసు అవిన్, అతని తల్లి పార్వతి వెళ్తూ వాహనం వెనుక భాగాన్ని ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో అవిన్, పార్వతిలకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో చీరాల బందోబస్తుకు వెళ్తున్న చినగంజాం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు ప్రమాదంలో గాయబడిన ఇద్దరిని తన వాహనంలో ఎక్కించుకొని చికిత్స నిమిత్తం చీరాల ఏరియ వైద్యశాలలో చేర్పించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశారు.

రాతి మండపం నిర్మాణానికి విరాళం


శింగరకొండ దేవస్థానం రాతి మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రామకృష్ణప్రసాద్, అపర్ణ దంపతులు

అద్దంకి, ఫిబ్రవరి 12: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో రాతి ముఖ మండపం నిర్మాణానికి చిలకలూరిపేటకు చెందిన మచ్చా రామకృష్ణప్రసాద్, అపర్ణ దంపతులు 1,01,116 రూపాయలు ఈవో సుభద్రకు సోమవారం అందజేశారు. దేవాలయం వద్ద ఏటీఎం ఏర్పాటుకు అవసరమైన గదిని నిర్మించేందుకు నర్సరావుపేటకు చెందిన బొడ్డుపల్లి శ్రీనివాసరావు, అరుణ దంపతులు ముందుకువచ్చారు.

కాగా, 204-25 ఆర్థిక సంవత్సరంలో శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంకు సంబంధించి పలురకాల అంశాలకు టెండర్లు నిర్వహించారు. ప్రాంగణంలో ఫోటోలు తీసుకునే హక్కుకు 1,31,500 రూపాయలకు దక్కించుకున్నారు. గత ఏడాది 1,21,000 రూపాయలుగా ఉంది. మరికొన్ని అంశాలకు సంబంధించి సరైన పాట రానందున వాయిదా వేసినట్లు ఈవో సుభద్ర తెలిపారు. కూరగాయలు సరఫరా చేయడానికి మారం మల్లికార్జునరావు, పూలు, పూలమాలలు సరఫరా చేయడానికి షేక్ మస్తాన్, మౌలాలి, పాలు సరఫరాకు శ్రీరామ రామలింగేశ్వరరావు, వీఐపీ వస్త్రాలు సరఫరాకు వసుంధర శిల్క్స్ , ప్రసాదం కవరు, ప్రింటింగ్ రసీదులు, ఇతర పుస్తకాలు సరఫరాకు ఎ. పూర్ణచంద్రరావు, లడ్డు, పులిహోర తయారీకి గుంజి రమణమ్మ, తిరుణాళ్ళకు షామియానా, వంట పాత్రలు సరఫరాకు మారుతి సప్లయర్స్ దక్కించుకున్నట్లు ఈవో సుభద్ర తెలిపారు.

ఓటర్ క్లయిమ్ విచారణను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలి

బల్లికురవ, ఫిబ్రవరి 12 : కొత్తగా ఓటు హక్కుకు దరఖాస్తులు వస్తే వెంటనే విచారణ పూర్తిచేసి కార్యాలయానికి పంపాలని తహసీల్దార్ సుభద్ర పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్నిగ్రామాల బూత్ లెవల్ అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఎల్వోలు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కడ లోపాలు లేకుండా అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే, తొలగింపులకు ఎవరైన దరఖాస్తులు పెడితే వెంటనే వారికి నోటీసులు జారీ చేసి విచారణ చేపట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు.. యువకుడికి గాయాలు

మేదరమెట్ల , ఫిబ్రవరి 12: జాతీయ రహదారిలో వెంకటాపురం వద్ద రోడ్డు దాటుతున్న ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో యువకుడు గాయపడ్డాడు. సోమవారం ధైవాలరావూరుకు చెందిన వీరనారాయణ ద్విచక్రవాహనంపై రేణంగివరం వెళ్లడానికి పి.గుడిపాడు రోడ్డు నుంచి రోడ్డు దాటుతుండగా విజయవాడ వైపు వెళుతున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని హైవే అంబులెన్స్‌లో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

పీఎం కిసాన్ పథకంపై అవగాహన

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 12: వేటపాలెం మండలం దేశాయిపట 1,3 ఆర్బీకేలలో రైతులకు పీఎం కిసాన్ పథకానికి సంబంధించి ఈకేవైసీ చేయించుకోవల్సిన ఆవశ్యకతపై ఏవో కాశీవిశ్వనాథ్ రైతులకు అవగాహన కల్పించారు. ఈనెల 21లోగా రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాలలో ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ మనీషా, రైతులు పాల్గొన్నారు.

హైకోర్టులో మాజీ సర్పంచ్ అప్పీల్

చీరాల, ఫిబ్రవరి 12: చీరాల మండలం విజయనగర్‌కాలనీ సర్పంచ్ దుడ్డు రూపవతి 2014లో పెట్టిన కేసును ప్రత్యేక న్యాయస్థానం కొట్టివేయటంతో ఆమె హైకోర్టులో అప్పీల్ చేశారు. రూపవతి, ఆమె భర్త మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. తాము చేసిన అప్పీల్ పై సోమవారం హైకోర్టులో న్యాయమూర్తి సురేష్‌రెడ్డి సమక్షంలో విచారణ చేశారు. 2014లో విజయనగర్ కాలనీ సర్పంచ్‌గా ఉన్న రూపవతి, తమ గ్రామంలో నిర్వహించిన జన్మభూమి, మా ఊరు గ్రామసభ సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్, అతని సోదరుడు ఆమంచి శ్రీనివాసరావు అలియాస్ స్వాములు, వారి అనుచరులు మరో 21 మంది తమపై దాడిచేసి దుర్భాషలాడారని, కులం పేరుతో దూషించారని కేసు పెట్టారు. అందుకు సంబంధించి టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. సదరు కేసు విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక స్థానంలో సాక్షులను విచారించిన మీదట న్యాయమూర్తి కొట్టివేశారు. ఈక్రమంలో రూపవతి హైకోర్టులో అప్పీల్‌కు వెళ్లారు. సోమవారం హైకోర్టులో రూపవతి తరపున న్యాయవాది వైకే వాదనలు వినిపించారు. దీంతో నిందితులకు నోటీసులు జారీచేశారు. మరుసటి విచారణ వచ్చే నెల 11వ తేదికి వాయిదా వేసినట్లు రూపవతి, మధుబాబు తెలిపారు.

ప్రజావ్యతిరేక భూచట్టాన్ని రద్దుచేయాలి

చీరాలటౌన్, ఫిబ్రవరి 12: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ఏపీ భూ హక్కుల చట్టం 2022ను రద్దు చేయాలని పలువురు న్యాయవా దులు పేర్కొన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి రిలే దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టం ద్వారా యజమానులకు, రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. న్యాయవ్యవస్థ ప్రమేయం లేకుండా న్యాయ, అన్యాయాల పరిశీలన రెవెన్యూ చేతుల్లోకి మారితే సామాన్యులకు భంగం వాటిల్లుతుందన్నారు. ఈక్రమం లో ప్రభుత్వం చట్టాన్ని రద్దు చేయాలని, లేకుంటే అప్పటి వరకు పోరాటం తప్పదని తెలిపారు. దీక్షలో న్యాయవాదులు ఎంవీ చలపతిరావు, భానుప్రకాష్, చంద్రశేఖర్, నాగమణి శయన, పద్మిని, తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను విడనాడాలి

చినగంజాం, ఫిబ్రవరి 12: మూఢ నమ్మకాలపై ఉన్న నమ్మకాలను విడనాడాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు అన్నారు. చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాష్ట్ర స్థాయి సైన్స్ కళాజాత కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి సైన్సు కళాజాత కార్యక్రమం ఈనెల 5 నుంచి 18 వరకు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా వరకు సైన్సు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రామారావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జనవిజ్ఞాన వేదిక మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్, మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి, చినగంజాం, కడవకుదురు జడ్పీ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు నాటుకోళ్ల యూనిట్లు పంపిణీ

మార్టూరు, ఫిబ్రవరి 12: మహిళలకు సుస్థిర జీవనోపాధి కలిగించేందుకు ఎఫర్ట్ సంస్థ కృషి చేస్తుందని డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు అన్నారు. మార్టూరులోని ఎఫర్ట్ కార్యాలయంలో సోమవారం పది మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా అశీల్ జాతి నాటుకోళ్లను పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి 11 నాటుకోళ్ళు, వాటి రక్షణ కొరకు ఒక బాక్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో రిలయన్స్ సంస్థ జిల్లా మేనేజరు, ఎఫర్ట్ సంస్థ కార్యకర్తలు రామారావు, సురేష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ

యద్దనపూడి(మార్టూరు), ఫిబ్రవరి 12: యద్దనపూడిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం డ్వాక్రా గ్రూపులకు వైఎస్ఆర్ నాలుగో విడత ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సభకు ఏపీఎం ఎస్.వెంకటరావు అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం, జడ్పీటీసీ లక్ష్మీనారాయణమ్మ, యద్దనపూడి సర్పంచ్ వలేరు రేణుక, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మస్తాన్‌కు నివాళి

సంతమాగులూరు, ఫిబ్రవరి 12: మండలంలోని కొమ్మాలపాడు గ్రామానికి టీడీపీ సీనియర్ నాయకుడు వయ్యకంటి ఖాదర్ మస్తాన్ సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ మస్తాన్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దాడిపై కేసు నమోదు

కారంచేడు(పర్చూరు), ఫిబ్రవరి 12: వ్యక్తిపై దాడికి సంబంధించి పలువురిపై కారంచేడు పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు.. కారంచేడు మండలం జరుబులవారిపాలెంలో పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గురువయ్య అనే ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా కొడవలివారిపాలెం వెళుతున్నాడు. ఈక్రమంలో రోడ్డుపై నీటికోసం ఏర్పాటుచేసిన పైపులైను విషయంలో వివాదం చోటుచేసుకుంది. పైపులైన్‌పై బైక్ వెళ్ళటంపై కొందరు వ్యక్తులు తమపై దాడిచేసినట్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులతోపాటు మరి కొంతమందిపై కేసునమోదు చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

బంద్‌ను జయప్రదం చేయాలి

వేటపాలెం(చీరాల), ఫిబ్రవరి 12: దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘ ప్రతినిధి పింజల భూషణం పిలుపునిచ్చారు. సోమవారం ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకురాలు ఎస్. లలితకుమారి మాట్లాడారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), ఫిబ్రవరి 12: చీరాల మండలం ఈపూరుపాలెం - బోయినవారిపాలెం మధ్యలో రైలు పట్టాలపై సోమవారం గుర్తుతెలియని సుమారు 50 ఏళ్ల వ్యక్తి రైలు ప్రమాదంలో మృతిచెందాడు. మృతుడు తెలుపురంగు చొక్కా, నీలం తెలుపు గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 12: బాపట్ల జిల్లా స్థాయిలో జరిగిన ఇన్స్పైర్ ప్రదర్శన పోటీలలో శ్రీప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని విజయం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయింది. పాఠశాలలో చదువుతున్న ఎల్లాల వైష్ణవి చేసిన ప్రాజెక్టు జిల్లాలో విజయం సాధించడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయింది. ఈ సందర్భంగా విద్యార్థినిని, గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయురాళ్లు సుంకర శ్రీదేవి, లక్ష్మిలను హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.